# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :282 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: ఆదివారం 19-01-2025 | పేజీలు:4 వెల: 2.00


## సైఫ్‌పై అటాక్.. అండర్‌వరల్డ్‌తో లింకు లేదు

ముంబై: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడికి పాల్పడిన దుండగుడు ఇంకా పరారీలో ఉన్నాడు. అతని కోసం ముంబై పోలీసు శాఖకు చెందిన 30 బృందాలు ఇంకా గాలిస్తున్నాయి. సైఫ్‌పై దాడితో అండర్‌వరల్డ్‌కు లింకు లేదని ఆ రాష్ట్ర మంత్రి పేర్కొన్నారు. అటాకర్ ఎటువంటి క్రిమినల్ గ్యాంగ్‌కు పనిచేయడం లేదన్నారు. అసలు ఎవరి ఇంట్లోకి ఎంటర్ అయ్యాడన్న విషయంలో కూడా ఆ వ్యక్తికి క్లారిటీ ఉండకపోవచ్చు అని పోలీసులు తెలిపారు. సైఫ్ ఇంట్లోకి చొరబడిన వ్యక్తి తరహాలో ఉన్న ఓ కార్పెంటర్‌ను అదుపులో తీసుకున్నారు పోలీసులు. బాంద్రా పోలీసు స్టేషన్లో అతన్ని విచారించిన తర్వాత రిలీజ్ చేశారు. ఖాన్‌పై జరిగిన అటాక్‌తో అతనికి సంబంధం లేదన్నాడు. ఈ కేసులో ఇప్పటి వరకు ఎవర్నీ అరెస్టు చేయలేదన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తి ఫోటో సీసీటీవీ ఫుటేజ్‌కు చిక్కింది. సైఫ్ అలీఖాన్ ఉండే సద్గురు శరన్ అపార్ట్‌మెంట్‌లోకి ఆ రోజు తెల్లవారుజామున 2.30 నిమిషాలకు ఓ వ్యక్తి ముఖానికి ఎరుపు రంగు స్కార్ఫ్ పెట్టుకుని మెట్ల మార్గంలో బిల్డింగ్ ఎక్కినట్లు పోలీసులు చెప్పారు. దొంగతనం చేయాలన్న ఉద్దేశంతోనే ఆ వ్యక్తి సైఫ్ ఇంట్లోకి ప్రవేశించినట్లు మహారాష్ట్ర మంత్రి యోగేశ్ కదమ్ తెలిపారు.

## ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పించిన బాలకృష్ణ, మంత్రి లోకేశ్, జూనియర్ ఎన్టీఆర్ తదితరులు



హైదరాబాద్,తెలుగుదేశం వ్యవస్థాపకులు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు, రాజకీయ ప్రముఖులు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. శనివారం ఉదయం హైదరాబాద్ లోని ఎన్టీఆర్ ఘాట్ వద్దకు నందమూరి కళ్యాణ్ రామ్, జూనియర్ ఎన్టీఆర్ లు చేరుకొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ కుమారులు నందమూరి బాలకృష్ణ, రామకృష్ణ, మనుమరాలు సుహాసిని, తదితర కుటుంబ సభ్యులు ఎన్టీఆర్ ఘాట్ వద్దకు చేరుకొని నివాళులర్పించారు. అనంతరం ఏపీ మంత్రి నారా లోకేశ్, నారా భువనేశ్వరితో కలిసి ఎన్టీఆర్ ఘాట్ వద్దకు చేరుకొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలకృష్ణ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ నటుడిగా, నాయకుడిగా తనకు తానే సాటి అన్నారు. ఎన్టీఆర్ తోనే తెలుగువారిలో రాజకీయ చైతన్యం వచ్చిందని, ఎన్టీఆర్ సాహసోపేతమైన పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. ప్రజల వద్దకు పాలన తీసుకురావడానికి ఎన్టీఆర్ ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని చెప్పారు. ఎన్టీఆర్ ముందు.. ఎన్టీఆర్ తరువాత అనేవిధంగా తెలుగు రాజకీయాలు ఉన్నాయని బాలకృష్ణ పేర్కొన్నారు. మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ అనేది ఒక పేరు కాదు.. ప్రభంజనం అన్నారు. రెండు రూపాయలకు కిలో బియ్యం, మహిళలకు ఆస్తుల్లో సమాన వాటా తదితర సంస్కరణలు తీసుకొచ్చారని కొనియాడారు. ఎన్టీఆర్ కు తప్పనిసరిగా భారతరత్న వస్తుందని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో పార్టీ పున:నిర్మాణంపై దృష్టిసారించామని చెప్పిన లోకేశ్.. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. తెలంగాణలో 1.60 కోట్ల మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నారని, టీడీపీపై తెలంగాణ ప్రజలకు ఎంతో ప్రేమ ఉందని పేర్కొన్నారు. టీడీపీ ఎమ్మెల్యే, ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘు రామ కృష్ణ రాజు ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల హృదయాల్లో ఎన్టీఆర్ చిరస్మరణీయంగా జీవించి ఉంటారని అన్నారు. ఎన్టీఆర్ కు భారతరత్న నిజమైన గౌరవంగా భావిస్తున్నామని, ఆయనకు భారతరత్న ఇవ్వడం వల్ల భారతరత్నకే గౌరవం వస్తుందని పేర్కొన్నారు. ఈ ఏడాది అది నిజమవుతుందని భావిస్తున్నామని పేర్కొన్నారు.

## నన్ను చంపాలని ప్లాన్ చేశారు.. ఆయన దయతో బ్రతికున్నాను!

న్యూఢిల్లీ,బంగ్లాదేశ్ మాజీ ప్రధాన మంత్రి షేక్ హసీనా సంచలన కామెంట్స్ చేసింది. ప్రధాని పదవికి రాజీనామా చేసి దేశాన్ని వదిలి భారత్‌కు వచ్చే ముందు తనని, తన చెల్లెలు షేక్ రెహానాను హత్య చేసేందుకు అనేక కుట్రలు చేశారని తెలిపారు. గతేడాది ఆగస్టు నెలలో ఉద్యోగ రిజర్వేషన్ల చిచ్చుతో చెలరేగిన అల్లర్లలో బంగ్లాదేశ్ ప్రభుత్వం పడిపోయింది. ప్రధానికి షేక్ హసీనా రాజీనామా చేశారు. అవమానకర రీతిలో తన సోదరితో కలిసి దేశాన్ని విడిచి పెట్టిన ఘటనను తాజాగా షేక్ హసీనా గుర్తు చేసుకుంది. అయితే, బంగ్లాదేశ్ లోని అవామీ లీగ్ పార్టీ ఫేస్‌బుక్ పేజీలో మాజీ ప్రధాని షేక్ హసీనా ఆడియో ప్రసంగాన్ని పోస్ట్ చేసింది. ఆ ఆడియోలో రెహానా, నేను కేవలం 30 నిమిషాల వ్యవధిలోనే చనిపోయే వాళ్లం.. తనను చంపేందుకు అనేక సార్లు కుట్రలు చేశారని ఆమె గుర్తు చేసుకున్నారు. 2004న ఆగస్టు 21న జరిగిన హత్యల నుంచి కోటాలిపారాలో జరిగిన భారీ బాంబు దాడి నుంచి బయటపడటమే నిదర్శనమని హసీనా వెల్లడించారు. ఆ అల్లాయే లేకపోతే నేను ఇలా మీ ముందు మాట్లాడే



దాన్ని కాదన్నారు. కుట్రదారులు నన్ను ఎలా చంపాలని ప్లాన్ చేశారో మీరందరూ చూశారు. కానీ, నేను నా దేశం నుంచి కట్టుబట్టలతో రావడంపై చాలా బాధగా ఉందని షేక్ హసీనా కన్నీరు పెట్టుకుంది.

## క్షణాల్లో హైడ్రాకు సమాచారం... టెక్నాలజీని అభివృద్ధి చేయాలన్న రంగనాథ్



హైదరాబాద్ : ప్రమాదాలు జరిగిన వెంటనే ఆ సమాచారాన్ని క్షణాల్లో హైడ్రాకు చేరేలా టెక్నాలజీని అభివృద్ధి చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పేర్కొన్నారు. పాత ముంబై హైవే వద్ద షేక్‌పేట ప్రాంతంలోని డ్యూక్స్ అవెన్యూ భవనంలో శుక్రవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటు చేసుకోవడంతో రంగనాథ్ ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదానికి గల కారణాలను హైడ్రా డీఆర్ఎఫ్ బృందం , ఫైర్ సిబ్బందితో చర్చించారు. డ్యూక్స్ అవెన్యూ భవనంలో అగ్నిప్రమాదం భవన రెండో అంతస్తులో ప్రారంభమై ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ నడుస్తున్న ప్రాంతానికి తీవ్ర నష్టం కలిగించింది. ఈ ఘటనపై రంగనాథ్ మాట్లాడుతూ, అగ్నిమాపక దళాలు , హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ సమయానికి చేరుకోవడంతో మంటలను రెండో అంతస్తు పరిధిలోనే అడ్డుకోవడం సాధ్యమైందని ప్రశంసించారు. అయితే, అగ్ని ప్రమాదం కారణంగా భవనంలోని మొత్తం రెండు సెల్లార్లు, నాలుగు పై అంతస్తుల్లో పొగ వ్యాపించినట్లు స్పష్టం చేశారు. అగ్నిప్రమాదానికి గల నిజమైన కారణాలను తెలుసుకునేందుకు భవనంలోని సీసీ టీవీ ఫుటేజీని సమగ్రంగా పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. భవన యజమానులు , నిర్వహణ సిబ్బంది భవిష్యత్‌లో అలాంటి ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ఘటనలో హైడ్రా డీఆర్ఎఫ్ , ఫైర్ సిబ్బంది వేగంగా స్పందించడం వల్ల నష్టం కొంతమేర తగ్గిందని రంగనాథ్ వెల్లడించారు. ఇటువంటి విపత్తులను ముందుగానే అరికట్టేందుకు అత్యాధునిక టెక్నాలజీ వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అభిప్రాయపడ్డారు

అగ్ని ప్రమాదాల నివారణకు సూచనలు

,భవన యజమానులకు కొన్ని ముఖ్యమైన సూచనలు చేశారు రంగనాథ్. భవనంలో అగ్నిప్రమాదం ప్రారంభమైన క్షణాల్లో అప్రమత్తం చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాద సమాచారం హైడ్రా డీఆర్ఎఫ్‌కు తక్షణమే చేరే విధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధునిక పద్ధతులను అమలు చేయాలని సూచించారు. భవనంలో ఫైర్ అలారమ్ వ్యవస్థ ఉంటే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.

## త్వరలోనే తెలంగాణలో టీడీపీ పార్టీని బలోపేతం చేస్తాం!

హైదరాబాద్,తెలంగాణలో టీడీపీ పార్టీ పునర్నిర్మాణంపై చర్చిస్తున్నాం అని, త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం అని ఏపీ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. తెలంగాణలో 1.60 లక్షల మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నారని, టీడీపీపై తెలంగాణ ప్రజలకు ప్రేమ మరియు ఆశ ఉందన్నారు. తెలంగాణలో టీడీపీ పార్టీని బలోపేతం చేయడమే తమ లక్ష్యం అని లోకేశ్ చెప్పారు. నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) 29వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ వద్ద మంత్రి నారా లోకేశ్ నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీఎంగా ఎన్టీఆర్ ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేశారు. ఎన్టీఆర్ ఘాట్ వద్ద మంత్రి నారా లోకేశ్ మీడియాతో మాట్లాడుతూ%% 'ఎన్టీఆర్ కేవలం మూడు అక్షరాలు కాదు.. అదొక్క ప్రభంజనం. సినీ రంగంలో అన్ని రకాల సినిమాలు తీసి తన మార్క్ చూపించారు. రాజకీయాల్లో కూడా ఎన్నో సేవలు అందించారు. రెండు రూపాయలకే బియ్యం అందించారు. మహిళలకు ఆస్తిలో హక్కు కల్పించిన గొప్ప వ్యక్తి ఎన్టీఆర్. తెలుగు వారిని మద్రాసీలు అనేవారు.. వాళ్లందరికీ తెలుగు వరమని గర్వంగా చెప్పుకునేలా చేశారు. ఎన్టీఆర్ ఏ ఆశయాలతో పార్టీని పెట్టారో మాకు తెలుసు. ఆయన ఆశయాలతో పార్టీని ముందుకు తీసుకెళతాం. ఏదైనా తప్పు జరిగితే.. దానిని సరిదిద్దడానికి కూడా పార్టీలో పెద్దలు ఉన్నారు' అని చెప్పారు. 'మా చిన్న తనంలో ఎన్టీఆర్ సీఎంగా ఉన్నారు. అప్పుడు ఆయన అబిడ్స్ లో ఉండేవారు. ఆ సమయంలో మమ్మల్ని గండిపేట తీసుకెళ్లేందుకు



ఒక పెద్ద కారులో ఆయనే స్వయంగా డ్రైవ్ చేస్తూ తీసుకెళ్ళారు. దారి మధ్యలో లెఫ్టుకు వెళ్లాలో, రైటుకు వెళ్లాలో తెలియక రోడ్డు మధ్యలో గుద్దేశారు. అది మాకు ఎప్పుడు గుర్తుండి పోయే మెమరీ. తెలంగాణలో టీడీపీపై ప్రజలకు ఎంతో ప్రేమ ఉంది. అందుకు ఉదాహరణ.. స్వచ్ఛందంగా లక్షా 60 వేల సభ్యత్వాలు ప్రజలు తీసుకోవడం. ఇప్పుడు ఎలాంటి ఎమ్మెల్యేలు లేకుండా ఇంతమంది సభ్యత్వం తీసుకున్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా పార్టీ కార్యకలాపాలు ప్రారంభిస్తాం. త్వరలోనే తెలంగాణలో టీడీపీ పార్టీని బలోపేతం చేస్తాం' అని నారా లోకేశ్ చెప్పుకొచ్చారు.

## స్థానిక ఎన్నికలు ఫిబ్రవరి చివర్లో?

హైదరాబాద్, రాష్ట్రంలో పంచాయతీ, మండల, జిల్లా పరిషత్తులకు ఎన్నికలు ఫిబ్రవరిలోనే జరగనున్నాయా? ఈ నెల 26 నుంచి అమలు కానున్న పథకాల వేడిలోనే ఈ ఎన్నికలను కానిచ్చేందుకు రేవంత్ సర్కారు సన్నద్ధమవుతోందా? ప్రస్తుతం కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా జరుగుతున్న చర్చ ఇది. స్థానిక సంస్థలకు ఎన్నికలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో ఆయా సంస్థలకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు పెండింగ్‌లో పడుతున్నాయి. దీనికితోడు ఎన్నికలను త్వరగా నిర్వహించాలంటూ స్థానిక నేతల నుంచి ప్రభుత్వంపై, పార్టీపై ఒత్తిడి పెరుగుతోంది. ఇటీవల గాంధీభవన్‌లో జరిగిన టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా స్థానిక సంస్థలకు ఎన్నికలు త్వరగా జరపాలంటూ దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిందని, కార్యకర్తలను, స్థానిక నాయకత్వాలనూ కాస్త పట్టించుకోవాలని నేతలకు చురకలు వేశారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి మూడు, నాలుగు వారాల్లో గ్రామ పంచాయతీలు, జిల్లా పరిషత్తులకు ఎన్నికలు నిర్వహించేందుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సన్నద్ధమవుతున్నట్లు గాంధీభవన్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఫిబ్రవరి మూడో వారంలో మూడు విడతలుగా గ్రామ పంచాయతీలకు, నాలుగో వారంలో ఎంపీటీసీ, జడ్పీటీసీలకు ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం.

బీసీ రిజర్వేషన్ పెంపే చిక్కుముడి!

ఫిబ్రవరిలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు బీసీ రిజర్వేషన్ పెంపు అంశం చిక్కుముడిగా మారింది. ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఏయే కులాల జనాభా ఎంత ఉంది? వారి రాజకీయ, ఆర్థిక, సామాజిక స్థితిగతులెలా ఉన్నాయి? అనే విషయాలు తెలుసుకునేందుకు ప్రభుత్వం కులగణన సర్వే నిర్వహించింది. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటనను ముగించుకుని వచ్చాక.. ఈ సర్వేపై మంత్రివర్గం సమీక్ష చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ఆ సమావేశంలోనే సర్వే నివేదికను ఆమోదిస్తారని, ఆ తర్వాత ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశంనిర్వహించి చర్చ చేపట్టే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 50 శాతానికి మించి అమలు చేయరాదంటూ సుప్రీంకోర్టు తీర్పు ఉంది. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ జనాభా దామాషా ప్రకారం 27 శాతం రిజర్వేషన్ ఆ వర్గాలకు అమలు చేయాల్సి ఉంటుంది. దీంతో కాంగ్రెస్ హామీ మేరకు బీసీలకు 42 శాతం అమలు చేయాలంటే మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో కులగణన సర్వే నివేదికను పరిగణనలోకి తీసుకుని బీసీల రిజర్వేషన్‌ను 42 శాతానికి పెంచుకునేలా అవకాశం ఇవ్వాలని కేంద్రాన్ని కోరనున్నట్లు చెబుతున్నారు. ఈ మేరకు పార్లమెంటులో చట్టం చేయాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానాన్ని ఆమోదించి కేంద్రానికి పంపనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే కేంద్ర ప్రభుత్వం ఇందుకు అనుమతించకపోతే.. స్థానిక



ఎన్నికల్లో రేవంత్ సర్కారు ఏ వైఖరి అవలంబిస్తుందన్నది చర్చనీయాంశంగా మారింది. పాత పద్ధతిలోనే ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి.. పార్టీ పరంగా బీసీలకు 42 శాతం టిక్కెట్లు ఇస్తుందా? లేక ఇతర మార్గాలను అన్వేషిస్తుందా? అన్నది తేలాల్సి ఉంది.

అలా అయితే ఎన్నికలు ఏప్రిల్ లోనే!

ఈ నెల 26 నుంచి రైతులకు రైతు భరోసా, భూమిలేని రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, రేషన్ కార్డు లేని వారికి కొత్త రేషన్ కార్డుల మంజూరు కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయనుంది. దీంతో ఈ పథకాల వేడిలోనే స్థానిక ఎన్నికలు కానిచ్చేయాలంటూ స్థానిక నాయకులు కోరుతున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు కూడా ఎన్నికలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసుకున్నామని, ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే 15 రోజుల్లో నిర్వహణ పూర్తి చేస్తామని అంటున్నారు. అయితే ఫిబ్రవరిలో ఎన్నికలు జరపాలని ప్రభుత్వం భావిస్తే.. అదే నెల 10వ తేదీ తర్వాత ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంటుంది. దీంతో ఎన్నికల కోడ్ లోపు పథకాల అమలు పూర్తవుతుందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు పూర్తిస్థాయిలో నిధులు సమకూరడం సాధ్యమవుతుందా? అన్న చర్చ జరుగుతోంది. కానీ, సంక్రాంతి తర్వాత రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ముందే ప్రకటించినందున.. ఆ మేరకు నిధుల సేకరణ జరుగుతోందని, ఆత్మీయ భరోసాకూ నిధులు సమకూరుతాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. అయితే కోడ్ అమల్లోపు ఈ నాలుగు పథకాలు అసంపూర్ణంగా అమలైతే.. దాని ప్రభావం స్థానిక సంస్థల ఎన్నికలపై పడే అవకాశం ఉంటుందన్న చర్చ కూడా పార్టీ వర్గాల్లో జరుగుతోంది. ఈ నేపథ్యంలో పథకాలు పూర్తి స్థాయిలో అమలైన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని భావిస్తే మాత్రం.. ఏప్రిల్ లేదా మే నెలలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందంటున్నారు.

## 30 ఏళ్లుగా ఈ దుర్మార్గులు నన్ను వేధిస్తున్నారు...



హైదరాబాద్: గత 30 ఏండ్లుగా ఈ దుర్మార్గులు తనను వేధిస్తున్నారని దివంగత ఎన్టీఆర్ సతీమణి లక్ష్మీపార్వతి అన్నారు. తన పై మీకు ఎందుకు కక్ష ఎందుకని, తానే తప్పు చేశానని ఏపీ సీఎం చంద్రబాబును ఉద్దేశించి అన్నారు. లక్షలాది మంది ముందే ఎన్టీఆర్ తనను పెళ్లి చేసుకున్నారని, భార్యగా ఇంటికి తీసుకొచ్చారని చెప్పారు. ఆయన ఆనందం కోసం, ఆరోగ్యం కోసం సేవ చేశానని, చివరికి కొందరి కుతంత్రాల వల్ల ఆయన తనను వదిలేసి వెళ్లిపోయారని చెప్పారు. ఇప్పటికీ నా జీవితాన్ని నాశనం చేయడానికి కొందరు దుర్మార్గులు ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. '29 ఏండ్లుగా ఎన్టీఆర్‌కు దూరమై మనోవేదనకు గురవుతున్నా. నా ఫోన్ నంబర్‌ను ఎవరో టీడీపీ వాళ్లు సోషల్ మీడియాలో పెట్టారు. నిన్నటి నుంచి వరుసగా వెయ్యికిపైగా బెదింపు కాల్స్ వస్తున్నాయి. మీరు అనుకున్నా.. అనుకోకున్నా నేను మీ అత్తగారిని కాదా చంద్రబాబు. ఇలాంటి అవమానం నాకు జరుగుతుందే మీరు చూస్తూ ఉంటారా?. మీకు బాధ్యత లేదా?. ఇన్నేండ్లు డబ్బులు ఉన్నా లేకున్నా ఎవరినీ చేయిచాచి అడుగలేదు. ఎన్టీఆర్ గౌరవం కాపాడేలా బతుకుతున్నా. నాపై కక్ష ఎందుకు, నేనేం తప్పు చేశా. ఎన్టీఆర్ పేరుతో మీరంతా లక్షల కోట్లు సంపాదించారు. అలాగే పెద్దాయన్ను సాగనంపారు. నాపై జరుగుతున్న వేధింపులపై స్పందించాల్సిన బాధ్యత మీకు లేదా' అంటూ చంద్రబాబును ప్రశ్నించారు.

### 108లో సీపీఆర్ చేసి శిశువు ప్రాణాలను కాపాడిన సిబ్బంది

మెదక్,ప్రమాదాలు జరిగినప్పుడు సకాలంలో వైద్యం అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చని వైద్యుల సలహాలు అక్షరాల నిజమని నిరూపించారు 108 సిబ్బంది. మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో అప్పుడే పుట్టిన శిశుశుకు శ్వాస ఇబ్బందులు తలెత్తాయి. వైద్యుల సూచన మేరకు వెంటనే చిన్నారిని 108 అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా చిన్నారి గుండె ఆగిపోయింది. వెంటనే స్పందించిన 108 సిబ్బంది ఆ చిన్నారికి సీపీఆర్ చేశారు. పైలట్ నవీన్, ఈఎంటీ రాజు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడి ఆసుపత్రిలో చేర్చారు. ప్రస్తుతం ఆ చిన్నారి వైద్యుల పర్యవేక్షణలో పూర్తిగా కోలుకుంటుంది. సకాలంలో సీపీఆర్ చేసిన 108 సిబ్బందిని చిన్నారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, పలువురు ప్రశంసించారు.

## సింగపూర్ వాణిజ్య మంత్రితో రేవంత్ భేటి..

హైదరాబాద్,సింగపూర్ లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సింగపూర్ వాణిజ్య, పర్యావరణ మంత్రి గ్రేస్ ఫు హై యిన్‌తో భేటీ అయింది. తెలంగాణతో వివిధ రంగాలలో సింగపూర్? ప్రభుత్వ భాగస్వామ్యంపై ఈ సందర్భంగా చర్చలు జరిపారు. ముఖ్యమంత్రితో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులు ఈ చర్చల్లో పాల్గొన్నారు. తెలంగాణలకు పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను వివరించారు. ప్రధానంగా నగరాలు, పట్టణాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, నీటి వనరుల నిర్వహణ, నైపుణ్యాల అభివృద్ధి, స్పోర్ట్స్, సెమీ కండక్టర్ల తయారీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక రంగాలకు ఉన్న అనుకూలతలను వివరించారు. తెలంగాణ ప్రభుత్వానికి సహకారం అందించేందుకు సింగపూర్ మంత్రి గ్రేస్ ఫు హైయిన్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్య సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకోవాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ప్రధానంగా ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్, నీటి వనరుల నిర్వహణ,



తెలంగాణ ఎంచుకున్న సుస్థిర వృద్ధి ప్రణాళికలపై ఎక్కువ ఆసక్తి ప్రదర్శించారు. పలు ప్రాజెక్టుల్లో పరస్పరం కలిసి పని చేసేందుకు అంగీకరించారు. ఉమ్మడిగా చేపట్టాల్సిన ప్రాజెక్టులు, వాటిపై అధ్యయనం చేసేందుకు ప్రత్యేక బృందాలను గుర్తించాలని నిర్ణయించారు. వివిధ రంగాల్లో సింగపూర్ అనుభవాలను పంచుకోవాలని, దేశంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న తెలంగాణలో సంయుక్తంగా చేపట్టే ప్రాజెక్టుల కార్యాచరణ వేగవంతం చేయాలని నిర్ణయించారు.

## సంపాదకీయం

ఆదివారం 19-01-2025

# సృజన శక్తులకు కొత్త రెక్కలు

స్టార్టప్‌లకు దండిగా అండదండలు అందిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. అంకుర సంస్థలు, నవకల్పనలకు నెలవుగా హైదరాబాద్ వెలుగొందుతోంది. తెలంగాణ అంతటా స్టార్టప్‌ల విస్తరణకు కృషి జరుగుతోంది. అయితే, అంకుర సంస్థలు కొన్ని ఆటుపోట్లను ఎదుర్కొంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ అండదండలతో ఐటీ, లైఫ్ సైన్సెస్, బయోటెక్, ఫార్మా రంగాల్లో స్టార్టప్‌లు తెలంగాణలో వృద్ధి చెందుతున్నాయి. ఇక్కడ రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో నెలకొన్న పరిశోధన-అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ) సంస్థలు యువతలో నవకల్పనలపై అనురక్తిని పెంపొందిస్తున్నాయి. రాష్ట్రంలో ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు, 250కి పైగా ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి అనుకునేవారికి అవకాశాలు లభిస్తున్నాయి. ఫలితంగా నవీకరణ సూచీలో తెలంగాణ ఉన్నత స్థానాలను అందుకొంటోంది. దేశంలో ప్రముఖ బయోటెక్ కంపెనీ ఉన్నతాధికారి హోదాలో పలు సాంకేతిక, మేనేజ్‌మెంట్ విద్యాసంస్థల్లోని యువతతో తరచూ సంభాషించే అవకాశం నాకు లభించింది. వారందరిలో కొత్త భావాలు, సొంత సంస్థలను స్థాపించాలనే ఉత్సాహం చూసి సంతోషం కలిగింది. తెలంగాణలో ప్రధాన ఇంజినీరింగ్ కళాశాల్లో ఇంక్యుబేషన్ విభాగాలున్నాయి. అవి కల్పించే సృజనాత్మక వాతావరణం వల్ల రాష్ట్రం నుంచి డార్విన్‌బాక్స్ వంటి మరొక యూనికార్న్ ఆవిర్భవిస్తుందని విశ్వసిస్తున్నాను.

### పెట్టుబడులు... మౌలిక వసతులు

దేశంలో నవీకరణ, అంకుర సంస్థల విధానంతో ముందుకొచ్చిన తొలి రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. ఈ విధానం కింద ఇన్నోవేషన్ సెల్, టీ హబ్, వియ్ హబ్, టీ వర్క్స్ సంస్థలు ఏర్పడి స్టార్టప్‌ల వికాసానికి ఆర్థికంగా, మౌలిక వసతుల పరంగా అన్నివిధాలా సాయపడుతున్నాయి. ప్రభుత్వ సంస్థలకు వివిధ సామగ్రి సరఫరాకు అంకుర సంస్థలను అనుమతిస్తున్న రాష్ట్రం తెలంగాణ. స్టార్టప్‌లకు ముందస్తు అనుభవం, టర్నోవరు లేకపోయినా, బయానా కట్టకపోయినా అవకాశం కల్పిస్తున్నారు. ప్రభుత్వానికి చెల్లించిన పన్నుల్లో 50శాతాన్ని ఏడేళ్ల వరకు వాపసు ఇవ్వడం, విద్యుత్ ఛార్జీల తగ్గింపు, భూమి వ్యయంలో 25శాతం దాకా (12000 డాలర్లకు మించకుండా) రిబేటు ఇవ్వడం ద్వారా వ్యాపార సౌలభ్య సూచీలో తెలంగాణ ఉన్నత ర్యాంకు సాధించింది. 2024 ప్రపంచ స్టార్టప్‌ల ఎకోసిస్టమ్ నివేదికలో భారత్‌కు సంబంధించి తెలంగాణ అయిదో స్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లోనే కాకుండా తెలంగాణ అంతటా అంకుర సంస్థలను, నవీకరణ వాతావరణాన్ని ప్రోత్సహించడానికి కృషి జరుగుతోంది. తెలంగాణలో 2014 నుంచి 10 కోట్ల డాలర్లకు పైగా పెట్టుబడులు సమీకరించిన స్టార్టప్‌లలో గ్రీన్ కో, జెనోటి, స్కైరూట్, స్పందన స్ఫూర్తి, స్మార్ట్‌బ్ ముఖ్యమైనవి. 2023లో జాతీయ అంకుర సంస్థల అవార్డులు సాధించిన సంస్థల్లో తెలంగాణకు చెందిన ఏక్సిల్ ఏరో (రక్షణ), జీవా బిజినెస్ వెంచర్స్ (ఇన్సూరెన్స్ టెక్), వివిడ్ మైండ్స్ టెక్నాలజీస్ (డీప్‌టెక్), ఆటోక్రసీ మెషినరీ (వ్యవసాయం) ఉన్నాయి. టీహబ్ తెలంగాణలో 2,000 స్టార్టప్‌లకు అండగా నిలుస్తోంది. నిరుడు హైదరాబాద్ ఏంజెల్స్ ఫండ్ 1.21 కోట్ల డాలర్లతో తొలి వెంచర్ క్యాపిటల్ ఫండ్‌ను ప్రారంభించింది. ఈ సంస్థ 20 టెక్, ఏఐ స్టార్టప్‌లకు పెట్టుబడి సమకూర్చనుంది. పునరుత్పాదక ఇంధన రంగంలో ఫోర్త్ పార్ట్‌నర్ ఎనర్జీ సంస్థ 2023 ఆగస్టులో 11 కోట్ల డాలర్ల పెట్టుబడులను సమీకరించింది. ఫిన్‌టెక్ రంగంలో వివిఫై ఇండియా ఫైనాన్స్ 2024 జనవరిలో 7.5 కోట్ల డాలర్ల పెట్టుబడులను సేకరించింది. ఏఐ ఫర్ ఆల్ నినాదంతో తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన శిఖరాగ్ర సదస్సు కృత్రిమ మేధకు రాష్ట్రం ఎంత ప్రాధాన్యమిస్తోందో చాటిచెప్పింది.

### ఏం చేయాలి?

స్టార్టప్‌లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిన్న పట్టణాల్లోనూ ఐటీ హబ్‌లను నిర్మించాలి. హైదరాబాద్‌కే పరిమితం కాకుండా వరంగల్, నిజామాబాద్, కరీంనగర్ వంటి పట్టణాలకూ వాటిని విస్తరించాలి. అక్కడ టీ హబ్‌లు, టీ వర్క్స్‌ను ఏర్పరచాలి. నిరంతరం విద్యుత్ సరఫరా జరిగేలా చూడటం మరో ప్రధానాంశం. మంచి విద్యాసంస్థలు, ఆస్పత్రులు, రహదారులను నిర్మించి ఉద్యోగులకు ఆకర్షణీయంగా మార్చాలి. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) హైదరాబాద్‌లో నవకల్పనలు, వ్యవస్థాపక సామర్థ్యం, స్టార్టప్‌ల కోసం ఉత్కృష్ట కేంద్రాన్ని నెలకొల్పింది. తెలంగాణలో నవీకరణకు, అంకుర సంస్థలకు లభిస్తున్న అనుకూలతలే ఈ కేంద్ర ఏర్పాటును సుసాధ్యం చేశాయి. 2047కల్లా తెలంగాణను లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడానికి అంకుర సంస్థలనూ భాగస్వాములను చేయాలి. నవకల్పనలకు అన్నివిధాలుగా అందదండలు అందించాలి.

# రూపాయిని నిలబెట్టే ప్రయత్నాలేవీ ?

హైదరాబాద్,ఆర్థిక మందగమనం, ద్రవ్యోల్బణం, రూపాయి పతనం ఇప్పుడు దేశాన్ని కుదిపేస్తున్నాయి. వీటి ప్రభావం ధరలపై పడుతోంది. తద్వారా సామాన్యుడు విలవిల్లాడుతున్నాడు. మరో పదిరోజుల్లో బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరోమారు సిద్ధమవుతున్న వేళ..ఈ దిద్దుబాటు చర్యలు ఉంటాయా అన్నది అనుమానంగానే ఉంది. ఎవరిదారి వారిది అన్న చందంగా ప్రభుత్వం నడుస్తోంది. ధరలు అదుపులోకి రావడం లేదు. నిరుద్యోగం తీరడం లేదు. రూపాయి విలువను కాపాడే ప్రయత్నాలు జరగడం లేదు. కానీ బడ్జెట్‌లో దిగుమతి సుంకాలు పెంచే ప్రయత్నం చేస్తామని అంటున్నారు. ఇలా చేయడం వల్ల రూపాయి విలువ పెరుగుతుందనుకుంటే పొరపాటు. నేలవిడిచి సాము చేస్తున్న చందంగా కేంద్రం చర్యలు ఉంటున్నాయి. నిజానికి చైనాను చూసి మనం ఎంతో నేర్చుకోవాల్సి ఉంది. అధిక జనాభాను ఉపయోగించుకుని వస్తూత్పత్తిన పెంచుకుని ప్రపంచ మార్కెట్ పెంచుకునే ప్రయత్నాలు చేయడం లేదు. అలాగే గత పదేళ్లుగా మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఏనాడూ రూపాయిని నిలబెట్టే ప్రయత్నాలు చేయలేదు. అందుకే డాలర్ ముందు రూపాయి తేలిపోతోంది. రోజురోజుకూ విలువ కోల్పోతూ తన రికార్డును తానే బద్దలుకొడుతోంది. ఇటీవల రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే..రూ. 87కు చేరువలో ఉంది. సమీపకాలంలో రూపాయి విలువ మరింత పతనం కావచ్చునని ఆర్థికవేత్తలు అంచనావేస్తున్నారు. అయినా ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ మాత్రం కొత్తంగా ఏయే పన్నులు వేయవచ్చో..వేటిని జీఎస్టీ కిందకు తీసుకుని రావవచ్చో అన్న ఆలోచనలో ఉన్నట్లుగా ఉంది. 2014లో ఎన్నికల ప్రచారంలో నరేంద్ర మోదీ రూపాయి పతనం గురించి చేసిన వ్యాఖ్యలు అందరూ గుర్తుకు తెచ్చుకోవాల్సిన తరుణమిది. దేశ రక్షణ గురించి గానీ,రూపాయి పతనం గురించి గానీ మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి పట్టింపు లేదని మోదీ అప్పట్లో ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఆయనతో పాటు, ఆయన ప్రధాని కావాలని కోరుకున్న ప్రముఖులంతా రూపాయి పతనం మీద చేసిన వ్యాఖ్యలు అప్పుడే మరచిపోలేం.ఎందుకంటే రూపాయి పతనం అప్పటి కన్నా వేగంగా పతనం అవుతోంది. అప్పట్లో రూపాయి గురించి గుండెలుబాదుకున్న వారంతా ఇప్పుడు ఎందుకో నోరువిప్పడం లేదు. ఇప్పుడు రూపాయి పతనం ఎంతగా పడిపోతున్నా ఎందుకనో మన మైనముని మోడీ మాత్రం నోరు విప్పడం లేదు. మన్మోహన్ సింగ్‌ను మౌనముని అంటూ దెప్పి పొడిచిన మోడీ ఇప్పుడు తాన అతిపెద్ద మౌనమునిగా మారారు. రూపాయి విలువ దారుణంగా పడిపోవడంతో ఆర్థిక నిపుణుల్లో ఆందోళన నెలకొంది. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా దిద్దుబాటు చర్యలేవీ ఫలితాలు ఇవ్వడం లేదు. సెప్టెంబర్ నెల నుండి రూపాయి పతనం స్పష్టంగానే కనిపిస్తోంది. సెప్టెంబర్ 12న డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.83.98కి పడిపోయింది. అప్పట్లో అదో రికార్డు. ఆ స్థాయికి రూపాయి విలువ పడి పోవడం అదే మొదటిసారి కావడంతో కలకలం రేగింది. మార్కెట్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మోదీ ప్రభుత్వానికి ఈ విషయమే పట్టని.. ఫలితంగా పతనంలో రూపాయి కొత్త రికార్డులు సృష్టించడం ప్రారంభమైంది. రూపాయి విలువ తగ్గిపోతోంది కాబట్టి మన జేబులో డబ్బు ఎక్కువగా ఖర్చు చెయ్యాల్సి వస్తోంది. అందువల్ల దిగుమతులపై సుంకాలు విధిస్తే సరిపోతుందన్న భావనలో మోడీ ప్రభుత్వం ఉంది. ఇదొక్కటే సరిపోదు. మనదేశ ఎగుమతులు పెరగాలి. మన మార్కెట్ పెరగాలి. మన వస్తువులు ప్రపంచాన్ని తాకాలి. అప్పుడే రూపాయికి బలం చేకూరుతుంది.



మేకిన్ ఇండియా నినాదంగా మారడంతో వస్తూత్పత్తి పడిపోయింది. కార్మికులు పనులు లేకుండా పస్తులు ఉంటున్నారు. అందుకే గత పదేళ్ళలో డాలర్‌తో రూపాయి మారకపు విలువ 25 శాతం పతనమైంది. అప్పట్లో నెలకు రూ.10వేలు సంపాదించేవారు సంసరాన్ని ఈడ్చుకుని వచ్చేవారు. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో నెలకు దాదాపు రూ.50వేల దాకా సంపాదించాలి. ఆ స్థాయిలో సామాన్యుల వేతనాలు పెరుగుతున్నాయా అంటే లేదు. కాబట్టి రూపాయి పతనం వల్ల నష్టపోతున్నది పేదలు, మధ్య తరగతివారు, సామాన్యులే. పదేళ్ల కిందట ఒక డాలర్ కోసం మనం 63 రూపాయలు చెల్లించాల్సి వచ్చేది. మరి ఇప్పుడు 87 రూపాయలు చెల్లించాల్సి వస్తోంది. ఇదివరకు కూరగాయలు కొంటే 100 రూపాయలకి సంచినిండేది, ఇప్పుడు 500 రూపాయలు పెట్టినా నిండట్లేదు. ఒక్క కూరగాయలే కాదు, ఇంట్లో వాడే ప్రతీ నిత్యావసరం ధరా పెరుగుతూనే ఉంటుంది.ఇప్పుడు నిత్యావసర వస్తువుల ధరలు కూడా దారుణంగా పెరిగాయి. పప్పుల ధరలు 250కి కిలోగా ఉన్నాయి. ధరలు మరింత పెరగడం ఖాయం. రూపాయి పతనం వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు బాగా పెరుగుతాయి. మనం విదేశాల నుంచి చమురును ఎక్కువగా కొంటున్నాం, భారీగా చెల్లింపులు జరుపు తున్నాం కనుక విలువ ప్రభావం ఇక్కడ అధికంగా ఉంటుంది. కోడిగుడ్డు ఒక రూపాయి నుంచి గత సంవత్సరం 5 రూపాయలు అయ్యింది. ఈ సంవత్సరం 7 రూపాయలు అయ్యింది. కోళ్ల దాణా, కరెంటు ఖర్చు, కూలీ వేతనాలు, నిర్వహణ ఖర్చులు, రవాణా ఖర్చులు ఇలా అన్నీ పెరుగుతూ గుడ్డు ధర కూడా పెరిగింది. ఇలా ఒకదానిపై ఒకటి ఆధారపడుతూ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా బలమైన అడుగులు పడకపోతే, భారతదేశం మరింతగా నష్టపోవడం ఖాయం. మన ఎగుమతులను, ఉత్పాదకత సామర్థ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉన్నది. ఉద్యోగ కల్పన, మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలి. దీంతో ఉత్పత్తి పెరిగి ఎగుమతుల ద్వారా విదేశీ మారక ద్రవ్యం ఆర్జించి రూపాయి స్థిరీకరణ చేయవచ్చు. దేశీయంగా ఎలక్ట్రానిక్స్ సంస్థలు నెలకొల్పి, ఉన్నవాటి సామర్థ్యాన్ని ఉత్పత్తిని పెంచి దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించాలి. దిగుమతుల్లో ప్రముఖపాత్ర వహిస్తున్న ఇంధన అవసరాల కోసం దేశీయ సంస్థల్ని పురికొల్పి, ఎక్కువ ఉత్పత్తిని సాధించాలి. ప్రత్యామ్నాయ ఇంధన వనరుల ఉత్పాదకతను పెంచడం ద్వారా స్వయం సమృద్ధి సాధించాలి. మనకు సహజవనరులతో పాటు, మానవ వనరులు విశేషంగా ఉన్నాయి. వాటిని ఉపయోగించుకుని వస్తూత్పత్తని పెంచుకుంటే తప్ప ముందుకు సాగలేం. ఇలాగే మీనమేషాలు లెక్కిస్తూ జీఎస్టీ పెంచడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవాలని చూస్తే సామాన్యుల బతుకులు ఛిద్రం కాగలవని గుర్తించాలి.

# ఉక్కు రెక్కల ఆయుధాలతో కొత్త శిఖరాలకు ఏపీ

అమరావతి,విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, కుమారస్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 'ఇది ఏపీ ప్రజలు గర్వించదగ్గ విషయం. విశాఖ ఉక్కు అంటే కేవలం పరిశ్రమ మాత్రమే కాదు. విశాఖ ఉక్కుకు ఆంధ్రుల హృదయాల్లో ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్ర ప్రజలకు ఇకపై అన్నీ మంచి రోజులే. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు' అని చంద్రబాబు అన్నారు. విశాఖ ఉక్కుకు కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ప్రకటించడంపై మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఆయన స్పందిస్తూ.. 'ఉక్కు రెక్కల ఆయుధాలతో ఏపీ కొత్త శిఖరాలకు ఎదుగుతుంది. ఇది లక్షలాది జీవితాలను మార్చే మంచి నిర్ణయం. కూటమి ప్రభుత్వంలో సత్ఫలితాలు కనిపిస్తు?న్నాయి. విశాఖ ఉక్కుకు పూర్వవైభవనం వస్తుంది. విశాఖ ఉక్కును కాపాడుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆయన కృషిని దగ్గర నుంచి చూశా. లక్షల మందికి ఉపాధి కల్పించే ఎ÷-లాంట్‌ను కాపాడినందుకు ప్రధాని మోదీ, నిర్మలా సీతారామన్, కుమారస్వామికి నా కృతజ్ఞతలు' అని తెలిపారు.

# బ్రిజేష్ ట్రిబ్యునల్ ఉత్తర్వులను స్వాగతిస్తున్నాం

హైదరాబాద్,కృష్ణా జలాల పంపిణీపై బ్రిజేష్ ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలు.. ముమ్మాటికీ కేసీఆర్ ప్రభుత్వ విజయమే అని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటి నుంచి సెక్షన్ 3 ప్రకారం నీళ్లు కేటాయించాలని కేసీఆర్ పట్టుబట్టారని పేర్కొన్నారు. తాజాగా ట్రిబ్యునల్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను స్వాగతిస్తున్నామని హరీష్ రావు తన ప్రకటనలో తెలిపారు. దీన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఘనతగా చెప్పుకోవడం సిగ్గు చేటు అని విమర్శించారు. అసలు ఏపీ పునర్విభజన చట్టం, సెక్షన్ 89 తెచ్చిందే కేంద్రంలోని కాంగ్రెస్ సర్కార్ అని గుర్తు చేశారు హరీష్ రావు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిందే కాంగ్రెస్ అని విమర్శించారు. ఆ తప్పిదాన్ని సరిదిద్దేందుకు బీఆర్ఎస్‌కు పదేళ్ల కాలం పట్టిందన్నారు. కృష్ణా నదిలో న్యాయమైన వాటా దక్కే వరకు బీఆర్ఎస్ రాజీలేని పోరాటం చేస్తుందని హరీష్ రావు మరోసారి స్పష్టం చేశారు.కృష్ణా జలాల వివాదంపై బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ కీలక ఉత్తర్వులిచ్చింది. కేంద్ర ప్రభుత్వం 2023లో అంతర్రాష్ట్ర జల వివాద చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం జారీ చేసిన తదుపరి టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్‌పై మొదట రెండు రాష్ట్రాల వాదనలు వినాలని ట్రిబ్యునల్ నిర్ణయించింది. దీనిపై వాదనలు పూర్తయిన తరువాత ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 89 ప్రకారం తుది వాదనలు వింటామని ట్రిబ్యునల్ ధర్మాసనం పేర్కొంది. తదుపరి వాదనలను ఫిబ్రవరి 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరుగనున్నాయి. ట్రిబ్యునల్ ఉత్తర్వుల ప్రకారం.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేటాయించిన నీటిలో ఎవరి వాటా ఎంత అన్నదానిపై వాదనలు విన్న తర్వాతే ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపుల అంశాన్ని ట్రిబ్యునల్ చేపట్టనుంది.

# బీజేపీ మెగా ఫ్యామిలీ జపం.. పెద్ద స్కెచ్చే!



హైదరాబాద్,కేంద్రంలో వరుగా మూడు సార్లు అధికారంలోకి వచ్చిన భారతీయ జనతా పార్టీకి దక్షిణాది రాష్ట్రాలు మాత్రం ఝలక్ ఇస్తున్నాయి. తమిళనాడు, కర్నాటక, కేరళలతోపాటు తెలుగు రాష్ట్రాల్లో బీజేపీకి అధికారం అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. గత ఎన్నికల్లో ఏపీలో టీడీపీ, జనసేన పార్టీలతో కలిసి పోటీచేసిన బీజేపీ తన ఉనికిని కాపాడుకోగలిగింది. ఇక తెలంగాణలో ఒంటిరిగానే పోరాటం సాగిస్తున్న ఆ పార్టీకి అధికారం మాత్రం అందని ద్రాక్షలాగే మిగిలిపోయింది. తెలంగగాణలో గత అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పార్టీతో కలిసి పోటీ చేసిన బీజేపీ ఎనిమిది నియోజకవర్గాల్లో విజయం సాధించగలిగింది. ఇక పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 17 నియోజకవర్గాల్లో పోటీ చేసిఎనిమిది నియోజకవర్గాల్లో విజయం సాధించింది. అయితే అధికారం మాత్రం ఆ పార్టీకి అందని ద్రాక్షగానే మిగిలింది. ఎలాగైనా వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో తెలంగాణలో అధికారమే లక్ష్యంగా బీజేపీ అదిష్టానం ఇప్పటి నుంచే పావులు కదుపుతోంది. ఎలాగైనా తెలంగాణలో అధికార పగ్గాలు అందుకోవాలన్న పట్టుదలతో ఆ పార్టీ అడుగులు వేస్తోంది. అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ బీజేపీ రోజురోజు బలోపేతం అవుతోంది. అయితే, బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసుకుంటూ వెళ్లినా వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావాలంటే బలమైన ప్రజా మద్దతు కలిగిన కుటుంబం తోడు పార్టీకి ఉండాలని బీజేపీ అధిష్టానం భావిస్తున్నది.ఏపీలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అధికారంలో ఉంది. అయితే, వచ్చే ఎన్నికల్లో ఇదే ఫార్ములాను తెలంగాణలోనూ అప్లయ్ చేయాలని బీజేపీ అధిష్టానం తొలుత భావించింది. కానీ, తెలంగాణలో తెలుగు దేశం పార్టీకి బలమైన క్యాడర్ ఉంది. ఆ పార్టీని నడిపించే నాయకుడు లేకపోయినా గ్రామగ్రామాన టీడీపీకి భారీగానే ఓటు బ్యాంక్ ఉంది. ఈ కారణంగా ఆ పార్టీతో కలిసి ఎన్నికలకు వెళితే బీజేపీకి పెద్దగా ప్రయోజనం ఉండదనీ, ఏపీలో మాదిరిగా ఉనికి చాటుకోవడానికే తెలుగుదేశంతో పొత్తు తెలంగాణలో ఉపయోగపడుతుందని బీజేపీ పెద్దలు అంచనా వేస్తున్నారు. దీనికితోడు ఏపీలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత చంద్రబాబు నాయుడు తెలంగాణలో తెలుగుదేశం పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టారు. దీంతో వివిధ కారణాలతో తెలుగుదేవం పార్టీని వీడిన తెలంగాణ నేతలలో చాలా మంది సొంత గూటికి అంటే తెలుగుదేశం పార్టీలోకి చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే పోటీచేయాలని అధినేత చంద్రబాబుపై పార్టీ క్యాడర్ ఒత్తిడి పెరుగుతోంది. ఇప్పటికే తెలంగాణలో త్వరలో జరగనున్నన పంచయతీ ఎన్ని కలలో సత్తా చాటేందుకు తెలుగుదేశం సమాయత్తమౌతోంది.ఇలాంటి పరిస్థితుల్లో బీజేపీ అధిష్టానం కనుసన్నల్లో నడుచుకునే, ప్రజాబలం కలిగిన కుటుంబం మద్దతు పార్టీకి అవసరమని ఆ పార్టీ అగ్రనాయకత్వం భావిస్తోంది. ఈ వ్యూహంలో భాగంగానే మెగా ఫ్యామిలీ అండకోసం బీజేపీ పెద్దలు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికే ఏపీలో పవర్ స్టార్, జనసేన అధినేత పవన్ కల్యాణ్ బీజేపీకి అన్నివిధాలుగా అండగా ఉంటున్నారు. బీజేపీ కేంద్ర పార్టీ సైతం పవన్ ను సొంత పార్టీ నేతగానే పరిగణిస్తున్నది. ఇదే క్రమంలో మెగా ఫ్యామిలీకి పెద్దగా ఉన్న మెగాస్టార్ చిరంజీవిని బీజేపీ మనిషిగా ప్రజల్లో ముద్ర వేసేందుకు ఆ పార్టీ పెద్దలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ మేరకు ఇప్పటికే సఫలం అయ్యారని చెప్పొచ్చు. చిరంజీవికి ఏపీతోపాటు తెలంగాణలోనూ భారీగానే అభిమానులున్నారు. వృద్ధుల నుంచి ప్రస్తుతం యువకుల వరకు మెగా ఫ్యామిలీకి మూడు తరాలకు చెందిన అభిమానులు ఉన్నారు. మెగా ఫ్యామిలీలో చిరంజీవి, రాంచరణ్‌తోపాటు దాదాపు అరడజన్ మంది హీరోలుగా కొనసాగుతున్నారు. వీరందరికీ ఫ్యాన్ ఫాలోయింగ్ భారీగానే ఉంది. ఈ క్రమంలో మెగా ఫ్యామిలీ అండతో వచ్చే ఎన్నికలకు వెళితే అధికార పీఠాన్ని దక్కించుకోవచ్చని బీజేపీ పెద్దలు బలంగా నమ్ముతున్నారు. అయితే, ఈ ప్లాన్ ఇప్పటికిప్పుడు అమలు చేస్తున్నది కాదని పరిశీలకులు అంటున్నారు. గత ఎన్నికల ముందు నుంచే మెగా ఫ్యామిలీకి బీజేపీ పెద్దలు ప్రాధాన్యతనిస్తూనే వస్తున్నారు. గత ఎన్నికల్లో ఈ వ్యూహాన్ని సమర్థవంతంగా అమలు చేయలేకపోయిన బీజేపీ అధిష్టానం.. వచ్చే ఎన్నికల్లో మాత్రం పక్కాగా అమలు చేసి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్న పట్టుదలతో ఉంది. ఏపీలో వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో బీజేపీ నిర్వహించిన కార్యక్రమాల్లో మెగాస్టార్ చిరంజీవికి ప్రాధాన్యతనిస్తూ వచ్చారు. గత ఎన్నికలకు ముందు అమిత్ షా, ప్రధాని నరేంద్రమోదీతో పలు దఫాలుగా చిరంజీవి, ఆయన కుమారుడు రాంచరణ్ భేటీ అయ్యారు. ముఖ్యంగా ఏపీలో కూటమి ప్రభుత్వం ప్రమాణస్వీకారోత్సవ సమయంలో ప్రధాని మోడీ చిరంజీవి, పవన్ కళ్యాణ్‌ను హత్తుకొని అభినందించినతీరు మెగా కుటుంబం బీజేపీకి మద్దతు దారు అన్న ముద్రను ప్రజల్లో వేసింది. దానిని కాపాడుకుని తెలంగాణలో 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికల నాటికి మరింత బలంగా మెగా ఫ్యామిలీ అండ పొందాలని ప్రయత్నిస్తున్నారని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

## పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు వరుస ఎదురుదెబ్బలు

లాహోర్,పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అల్ ఖాదిర్ కేసులో ఇమ్రాన్, ఆయన సతీమణి బుష్రా బీబీ దోషులుగా తేలారు. ఆయనకు 14 ఏళ్ల జైలు శిక్ష పడగా.. ఆమెకు ఏడేళ్ల జైలు శిక్షను విధిస్తూ న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. అడియాలా జైలులో కట్టుదిట్టమైన భద్రత నడుమ న్యాయమూర్తి తుదితీర్పు చదివి వినిపించారు. ఇమ్రాన్, బుష్రాలకు 10 లక్షలు, 5 లక్షల పాకిస్థానీ రూపాయల జరిమానా విధించారు. ఇమ్రాన్ దంపతులతో పాటు మరో ఆరుగురిపైనా నేషనల్ అకౌంటబులిటీ బ్యూరో 2023లో ఈ కేసు నమోదు చేసింది. లండన్‌లో ఉంటున్న పాక్ స్థిరాస్తి వ్యాపారి మాలిక్ రియాజ్ హుసేన్ నుంచి వసూలుచేసిన 19 కోట్ల పౌండ్లను బ్రిటన్ పాక్‌కు పంపగా.. ఆ సొమ్మును ఇమ్రాన్ దంపతులు గోల్‌మాల్ చేశారని ఆరోపణ. దీన్ని అల్‌ఖాదిర్ ట్రస్టు కేసుగా వ్యవహరిస్తున్నారు. ఇమ్రాన్ ప్రధానిగా ఉన్నప్పుడు బ్రిటన్ నుంచి అందిన ఆ 19 కోట్ల పౌండ్లను జాతీయ ఖజానాలో జమ చేయకుండా, సుప్రీంకోర్టు గతంలో రియాజ్‌హుసేన్‌కు విధించిన జరిమానాలో కొంత మొత్తాన్ని ఆ నగదులో నుంచి కట్టడానికి అనుమతించారని

# భారీగా తరలివస్తున్న భక్తులు

ప్రయాగ్‌రాజ్, భారీగా తరలివస్తున్న భక్తులతో త్రివేణి సంగమంలో ఆధ్యాత్మిక శోభ కొనసాగుతోంది. భక్తుల భజనలు, హర్ హర్ మహాదేవ్ నామస్మరణతో ప్రయాగ్‌రాజ్ మార్మోగుతోంది. మహాకుంభమేళాను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న యూపీ ప్రభుత్వం.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భారీ ఏర్పాట్లు చేసింది. ఈ సారి మహా కుంభమేళాకు 40కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తోంది.ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా మూడో రోజుకు చేరుకుంది. ఈ మహాకుంభమేళాకు తెల్లవారుజామునుంచే భక్తులు పోటెత్తుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ భక్త జనసంద్రాన్ని తలపిస్తోంది. మహాకుంభమేళాకు నాలుగోరోజు కూడా భక్తులు లక్షలాదిగా తరలివస్తున్నారు. త్రివేణి సంగమంలో భక్తుల పుణ్యస్నానాలు కొనసాగుతున్నాయి. నదీమతల్లికి హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు.ప్రపంచంలోనే అతిపెద్ద మతపరమైన ఆధ్యాత్మిక పండుగ మహా కుంభ్ ఈసారి సంగం నగరం ప్రయాగ్‌రాజ్‌లో ఘనంగా నిర్వహిస్తున్నారు. లక్షలాది సంవత్సరాల క్రితం కుంభం నుండి జారిన అమృతాన్ని వెతుక్కుంటూ గంగా-యమునా, అదృశ్య సరస్వతి ఒడ్డుకు భక్తులు గుంపులు గుంపులుగా పెద్ద ఎత్తున తరలి వస్తారు. మకర సంక్రాంతి రోజున అంటే మంగళవారం నాడు 3.5 కోట్ల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సంఖ్య నిజంగా ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎందుకంటే ప్రపంచంలోని 234 దేశాల్లో కేవలం 45 దేశాల్లో మాత్రమే 3.4 కోట్లకు పైగా జనాభా ఉంది. అంటే 189 దేశాల జనాభా కంటే పెద్ద జనసమూహం ఒకేసారి సామూహిక స్నానానికి సంగం నగరికి చేరుకుంది. ఇది దేవుని పట్ల ప్రజలకు ఉన్న నిజమైన విశ్వాసాన్ని తెలియజేస్తుంది. మకర సంక్రాంతి రోజున, భక్తులు గంగలో స్నానమాచరించిన వెంటనే, కుంభం నుండి అమృతం చిందినట్లు త్రివేణి సంగమం చుక్కలు చిమ్మడం ప్రారంభించాయి. వివిధ అఘోరాలకు చెందిన సాధువులు మంగళవారం మహాకుంభంలో మొదటి 'అమృత స్నాన్' తీసుకున్నారు. ఈ సందర్భంగా త్రివేణి సంగమం వద్ద జనం భారీగా తరలివచ్చారు. మహా కుంభ్‌లోని చాలా అఘోరాలకు బూడిద ధరించిన నాగ సాధువులు నాయకత్వం వహించారు. వారు తమ క్రమశిక్షణ, సాంప్రదాయ ఆయుధాలపై పట్టుతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. నైపుణ్యంతో ఈటెలు, కత్తులు పట్టుకోవడం నుండి ఉద్వేగభరితంగా డ్రమ్ములు వాయించడం వరకు, వారి ప్రదర్శనలు పురాతన సంప్రదాయాల ఉత్సాహభరితమైన వేడుక అని అధికారిక ప్రకటన తెలిపింది. మహాకుంభ్‌లో పురుష నాగ సాధువులే కాకుండా, పెద్ద సంఖ్యలో మహిళా నాగ సన్యాసులు కూడా అమృత స్నానం అచరించారు. మహా కుంభం మొదటి ప్రధాన స్నానం సోమవారం 'పౌష్ పూర్ణిమ' సందర్భంగా జరిగింది. అయితే అఘోరాలు, హిందూ మతాల సభ్యులు మకర సంక్రాంతి రోజున వారి మొదటి స్నానం చేశారు.శ్రీ పంచాయతీ అఘోరా మహానిర్వాణి, శ్రీ శంభు పంచాయతీ అటల్ అఘోరా మొదట 'అమృత స్నాన్' తీసుకున్నారు. మహాకుంభ్‌లో వేలాది మంది అఘోరాలు పాల్గొంటున్నారు. అమృత స్నాన్ సందర్భంగా హెలికాప్టర్ నుంచి భక్తులపై గులాబీ రేకుల వర్షం కురిపించారు. ప్రయాగ్‌రాజ్‌లో ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి పూర్ణ కుంభం నిర్వహిస్తారు. అయితే 12 పూర్ణ కుంభాల తర్వాత 144 సంవత్సరాలకు ఒకసారి మహాకుంభం జరుగుతుందని మహానిర్వాణి అఖారాకు చెందిన మహామండలేశ్వర చేతన్‌గిరి మహారాజ్ అన్నారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనడం భక్తులకు అరుదైన వరం. 68 మంది మహామండలేశ్వరులు, మహానిర్వాణి అఘోరాకు చెందిన వేలాది మంది సాధువులు అమృత స్నానంలో పాల్గొన్నారు. 35 మంది మహామండలేశ్వరులు, నిరంజని అఘోరాకు చెందిన వేలాది మంది నాగ సాధువులు అమృత స్నాన్‌లో పాల్గొన్నారు.

# నీట్ యూజి పరీక్షలపై కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, దేశవ్యాప్తంగా వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నీట్ యూజీ పరీక్షలు నిర్వహణపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పెన్-పేపర్ పద్ధతిలోనే నిర్వహించనున్నట్లు ప్రకటించింది. దేశమంతా ఒకే రోజు.. ఒకే షిఫ్టులో ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. కేంద్ర విద్య, ఆరోగ్యశాఖల మధ్య సుదీర్ఘ సంప్రదింపుల అనంతరం చివరకు ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపింది. 'నేషనల్ మెడికల్ కమిషన్ నిర్ణయం ప్రకారం.. నీట్ యూజీ పరీక్ష పెన్, పేపర్ పద్ధతిలో నిర్వహిస్తాం. ఒకేరోజు, ఒకే షిఫ్టులో ఈ పరీక్ష ఉంటుంది' అని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ అధికారి వెల్లడించారు. దేశంలో అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు హాజరయ్యే పరీక్షగా నీట్ యూజీ నిలుస్తోంది. 2024లో 24లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. జేఈఈ మెయిన్ తరహాలోనే ఈసారి (2025) కూడా నీట్ యూజీని ఆన్‌లైన్ విధానంలో నిర్వహించాలని ఎన్‌టీఏ భావిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఇస్రో మాజీ ఛైర్మన్ కస్తూరి రంగన్ ఛైర్మన్‌గా నియమించిన నిపుణుల కమిటీ సైతం ఆన్‌లైన్ విధానం (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ - అఃఌ)లో నీట్ నిర్వహించాలని సిఫారసు చేసింది. అయితే, తాజాగా కేంద్ర విద్య, ఆరోగ్యశాఖలు జరిపిన విస్తృత చర్చల్లో ఓఎంఆర్ పద్ధతికే మొగ్గుచూపుతూ నిర్ణయం తీసుకున్నారు.

## ఫలితాల ప్రకటన..

బెంగళూరు, ప్రముఖ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో కంపెనీ రూ.6,806 కోట్ల ఏకీకృత నికర లాభాలను అర్జించింది. గతేడాది ఇదే సమయంలో నమోదైన రూ.6,106 కోట్లతో పోలిస్తే 11.46 శాతం వృద్ధి చెందింది. అదే సమయంలో కంపెనీ ఆదాయం 7.58 శాతం పెరిగి రూ.41,764 కోట్లకు చేరిందని కంపెనీ తన రెగ్యులేటర్గీ ÷ల్గ÷లింగ్‌లో పేర్కొంది. గతేడాది డిసెంబర్ ముగిసే సమయానికి కంపెనీ ఆదాయం రూ.38,821 కోట్లుగా ఉంది. ఫలితాల నేపథ్యంలో భవిష్యత్ ఆదాయ వృద్ధి అంచనాలను సైతం ఇన్ఫోసిస్ వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయ వృద్ధి 4.5- 5 శాతంగా నమోదు కావొచ్చని పేర్కొంది. ' బలహీనమైన త్రైమాసికంలో బలమైన రాబడి నమోదు చేశాం. మా వ్యూహాత్మక చర్యల విజయానికి ఇది ప్రతిబింబం. ఏఐ సామర్థ్యాలను బలోపేతం చేస్తూనే ఉన్నాం. ముఖ్యంగా జెనరేటివ్ ఏఐ పై దృష్టి సారించాం. ఇదే మా క్లయింట్ పెరుగుదలకు నిదర్శనం' అని ఇన్ఫోసిస్ సీఈఓ, ఎండీ సలీల్ పరేఖ్ అన్నారు. డిసెంబర్ త్రైమాసికంలో కొత్తగా 5,591 మందిని నియమించుకున్నట్లు తెలిపారు. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 3,23,379కి చేరిందని పేర్కొన్నారు. ఫలితాల నేపథ్యంలో ఇన్ఫీ షేరు ఎన్ఎస్ఈలో 1.52 శాతం క్షీణించి రూ.1920.05 వద్ద ముగిసింది.

## నారా లోకేశ్ లేఖ

అమరావతి,తెలుగు దేశం పార్టీ సరికొత్త చరిత్ర సృష్టించింది. 1,00,52,598 సభ్యత్వాలతో మరో అధ్యయనం ప్రారంభించింది. రాష్ట్ర వ్యాప్తంగా 11 నియోజకవర్గాల్లో పార్టీ సభ్యత్వాల సంఖ్య లక్ష మార్కు దాటింది. మరో 105 నియోజకవర్గాల్లో పార్టీ సభ్యుల సంఖ్య 50 వేల మార్కు దాటింది. మరోవైపు, పార్టీని నమ్ముకున్న కార్యకర్తల సంక్షేమం కోసం సంక్షేమ నిధి సారధి నారా లోకేశ్ విప్లవాత్మక అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో కార్యకర్తలకు ప్రమాద బీమాను రూ.5 లక్షలకు పెంచుతూ యూనైటెడ్ ఇండియా ఇన్స్యూరెన్స్‌తో పార్టీ ఒప్పందం కుదుర్చుకుంది.కోటి సభ్యత్వాల మార్క్ దాటిన సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ లేఖ రాశారు. కార్యకర్తే అధినేత అంటూ ప్రశంసించారు. విశ్వ విఖ్యాత నటులు, స్వర్గీయ నందమూరి తారకరామారావు పార్టీ పెట్టిన ముహూర్త బలం చాలా గట్టిదని పేర్కొన్నారు. నాడు ఒక్కరితో ప్రారంభమైన ప్రయాణం నేడు కోటి మందితో అతి పెద్ద కుటుంబంగా మారిందని వ్యాఖ్యానించారు. సభ్యత్వం తీసుకొని తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులుగా చేరిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గ్రామగ్రామాన ఒక పండగలా నిర్వహించారని ప్రశంసించారు. ఊరూవాడా జై టీడీపీ నినాదాలతో హోరెత్తించారని అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అండమాన్‌తో సహా అనేక ప్రాంతాల్లో ఉన్న తెలుగు వారు, వివిధ దేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వాములు అయ్యారని తెలిపారు. గత రికార్డులు తిరగరాస్తూ కోటి సభ్యత్వాలతో సరికొత్త చరిత్ర సృష్టించామని హర్షం వ్యక్తం చేశారు.

వైసీపీకి చుక్కెదురు

సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కార్యకర్తలు, నాయకులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలం, బలగం.. పసుపు జెండా అంటే మనకు ఒక ఎమోషన్ అని వ్యాఖ్యానించారు. పీక మీద కత్తి పెట్టి వేరే పార్టీ అధినేతకు జై కొడితే విడిచిపెడతామని చెప్పినా జై చంద్రబాబు , జై టీడీపీ అంటూ ప్రాణత్యాగం చేసిన చంద్రయ్య తనకు ప్రతి క్షణం గుర్తొస్తారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ప్రత్యర్థులు ఉన్మాదుల్లా మీద పడుతుంటే మీసం మెలేసి, తొడకొట్టి జై చంద్రబాబు అన్న అంజిరెడ్డి తాత తెగువ తనకు నిత్యస్ఫూర్తి అని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో బూత్ ఏజెంట్‌గా ఉండటానికి వీలు లేదని ప్రత్యర్థి మూకలు గొడ్డలి వేటు వేసినా రక్తపు గాయాలతోనే పోలింగ్ బూత్‌లో కూర్చొని రిగ్గింగ్ అడ్డుకున్న ఉక్కు మహిళ మంజుల గారి ధైర్యం గురించి గుర్తుచేసుకున్న ప్రతిసారి తనకు గర్వంగా ఉంటుందని అన్నారు. ప్రతి గ్రామంలో ప్రాణం ఎక్కువా? పార్టీ ఎక్కువా? అంటే పార్టీనే ఎక్కువ అని జైకొట్టే చేతులు అనేకం ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఏమి ఇచ్చినా, ఎన్ని జన్మలెత్తినా కార్యకర్తల రుణం తీర్చుకోలేనిదని అన్నారు. దేశంలో ఏ పార్టీకి లేని కార్యకర్తల బలం టీడీపీకి మాత్రమే సొంతమని అన్నారు. ఏ పార్టీ ఇవ్వని గౌరవం తెలుగుదేశం పార్టీ తమ కార్యకర్తలకు ఇస్తుందని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీలో ఏ ముఖ్యమైన నిర్ణయం తీసుకోవాలన్నా కార్యకర్తలతో చర్చించిన తరువాతే ప్రకటిస్తారని గుర్తు చేశారు. కార్యకర్తల మనోభావాలను, అభిప్రాయాలను గౌరవించే ఒకే ఒక్క పార్టీ తెలుగుదేశం మాత్రమే అని అన్నారు.కార్యకర్తలను ఉద్దేశించి రాసిన లేఖలో పలు ఇతర అంశాలను కూడా ప్రస్తావించారు. "మంచి నిర్ణయం తీసుకుంటే పొగిడేది మీరే, ఏదైనా నిర్ణయం నచ్చకపోతే ప్రశ్నించేది మీరే. అందుకే పార్టీలో ప్రతి కార్యకర్త అధినేతే. కార్యకర్తల సంతోషమే చంద్రబాబు గారికి ఆనందం. ఆయన నాతో మాట్లాడిన ప్రతిసారి కార్యకర్తల చర్చ ఖచ్చితంగా ఉంటుంది. కార్యకర్తలకు ఉపాధి, వైద్యంతో పాటు వారి పిల్లల చదువుకు సాయం చెయ్యాలని చెబుతుంటారు. కార్యకర్తల సంక్షేమ నిధి సమన్వయకర్తగా పవిత్రమైన బాధ్యత నాకు అప్పగించారు. ఇప్పటివరకు 2,500 మందికి పైగా కార్యకర్తల పిల్లల చదువులకు సహాయం అందించాం. వివిధ ప్రమాదాల్లో మరణించిన సుమారు 5,164 మంది కార్యకర్తల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2 లక్షల రూపాయలు చొప్పున రూ. 103 కోట్ల 28 లక్షల రూపాయలు అందజేసాం.

# సిఎం అభ్యర్థి లేకుండా ఢిల్లీ ఎన్నికలు



న్యూఢిల్లీ,ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు బహుశా తొలిసారిగా, ఏ రాజకీయ పార్టీ కూడా ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రజల ముందు ఉంచలేని పరిస్థితుల్లో జరుగుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అధికార పార్టీకి ఎదురులేని నాయకుడైనప్పటికీ చట్టపరమైన చిక్కుల కారణంగా వారు ఆయనను తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా చెప్పలేకపోతున్నారు. బిజెపి, కాంగ్రెస్ రెండింటికీ దేశ రాజధానిలో తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా చూపించడానికి ప్రజాదరణ పొందిన లేదా బలమైన నాయకుడే లేరు. స్థానిక నాయకత్వం లేకపోవడంతో, వారు ఓటర్లను ఆకర్షించడానికి బయటి నుండి 'దిగుమతి చేసుకున్న' నాయకులు లేదా తమ హైకమాండ్‌లపై ఆధారపడుతున్నారు.మాజీ ఐపిఎస్ అధికారిణి కిరణ్ బేడిని తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా చూపించడం ద్వారా బిజెపి గతంలో ఒకసారి తప్పటడుగు వేసింది. ఓటర్లను లేదా బిజెపి కేడర్‌ను కూడా ఆమె ఉత్సాహపరచడంలో విఫలమయ్యారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆమె పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఎన్నికల తర్వాత, ఆమె ప్రజాజీవితంలో ఎక్కడా కనిపించలేదు. అరవింద్ కేజ్రీవాల్ అధికార ఆప్‌కి కిరీటం లేని నాయకుడు కావడంతో సాధారణంగా అందరూ ఆ పార్టీ ముఖ్యమంత్రిగా భావిస్తున్నప్పటికీ ఆయన చట్టపరమైన చిక్కులను ఎదుర్కొంటున్నారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఆయన అధికారిక ఫైళ్లపై సంతకం చేయలేరు లేదా సిఎం కార్యాలయంలోకి ప్రవేశింపలేరు.దానితో ఆయనను తమ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఆప్ చెప్పలేకపోతున్నది. దానితో బిజెపి మార్గంలో ఆప్ కేజ్రీవాల్, సిఎం ఆతిశీ అనే డబుల్ ఇంజిన్ సర్కార్‌ను ప్రస్తావిస్తున్నారు. భారత ఎన్నికల కమిషన్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి చాలా ముందుగానే తన అభ్యర్థులందరినీ ప్రకటించడం ద్వారా ఆప్ సౌకర్యవంతమైన స్థితిలో ఉండగా, అభ్యర్థుల ఎంపికలో బిజెపి, కాంగ్రెస్ చివరి వరకు తికమకపడుతున్నాయి. అంతర్గత కలహాలు, బలమైన అభ్యర్థులను గుర్తించడంలో అనిశ్చితి వారి ఎంపికలను కష్టతరం చేశాయి. మొదట్లో, బిజెపి మాజీ కేంద్ర మంత్రి స్మృతి ఇరానీని సిఎం అభ్యర్థి కాబోతున్నట్లు ప్రచారం జరిగింది. కానీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తల బలమైన వ్యూహాత్మక నిర్వహణతో హర్యానా, మహారాష్ట్రలలో గొప్ప ప్రయోజనం పొందిన తర్వాత, బిజెపి ఇప్పుడు సొంతంగా సిఎం అభ్యర్థులను ప్రకటించే సాహసం చేయలేకపోతోంది. 26 ఏళ్లుగా ఢిల్లీలో అధికారానికి దూరంగా ఉంటూ వస్తున్న బిజెపి ఈసారి ఎట్లాగైనా అధికారం చేపట్టాలని పట్టుదలగా ఉంది. పదేళ్ల ఆప్ ప్రభుత్వం ఎదుర్కొంటున్న ప్రభుత్వ వ్యతిరేకత అందుకు అనుకూలం కాగలదని ఆశిస్తున్నది. మొహల్లా క్లినిక్‌లు, కార్పొరేట్ స్థాయిలో మున్సిపల్ పాఠశాలలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలలో కొంతమేరకు కేజ్రీవాల్ దేశంలో మరే ఇతర ముఖ్యమంత్రి సాధింపలేని పాలనా విజయాలు సాధించినా గెలుపుకోసం అవి మాత్రమే సరిపోవు. ప్రపంచంలోనే అత్యంత కాలుష్యమైన, అపరిశుభ్రమైన దేశరాజధానిగా నేడు ఢిల్లీ అప్రతిష్ఠకు గురవుతున్నది. ప్రధాని నరేంద్ర మోడీ చెబుతున్నట్లు మరో మూడేళ్లలో భారత్ ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగినా, 2047 నాటికి 'వికసిత్ భారత్'గా అభివృద్ధి చెందినా ఇటువంటి రాజధాని నగరంతో అంతర్జాతీయంగా భారత్ సగర్వంగా నిలబడలేదు. ఒక వంక మురికి కాలువగా మారిపోయిన యమునా నది, ఇంకోవైపు ఎటుచూసినా కనిపించే వ్యర్థపదార్థాలు, ఇవికాకుండా కాలుష్యం..ఇవన్నీ కలిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థత, వైఫల్యాలు ప్రజల ముందు నిలుస్తున్నాయి. అవినీతి వ్యతిరేక ఉద్యమం నుండి ప్రజాజీవనం ప్రారంభించిన కేజ్రీవాల్ స్వయంగా అవినీతి కేసులో జైలుకు వెళ్లిరావడం, ఆయన సహచరులు అనేకమంది వెళ్లడం కూడా ఆ పార్టీని ఆత్మరక్షణలో పడేస్తున్నాయి. ఆ కేసులు అన్ని రాజకీయ కక్షసాధింపుగా నమోదు చేసినవి అని చెబుతున్నా, ఆ కేసులు ఏవీ న్యాయస్థానాల ముందు నిలబడే అవకాశాలు లేకపోయినా జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అందుకనే తన రాజకీయ జీవనంలో పెనుసవాల్‌ను ఇప్పుడు ఆయన ఎదుర్కొంటున్నారు. మరోవంక, సైతం బలమైన స్థానిక నాయకత్వం లేకపోవడంతో 2014 నుండి వరుసగా మొత్తం 7 లోక్‌సభ సీట్లను గెల్చుకుంటున్నప్పటికీ అసెంబ్లీ ఎన్నికలలో పరాజయం తప్పడం లేదు. మీడియాలో సంచలనాలు సృష్టించే నాయకులపై ఆధారపడుతుంది. కానీ ఆప్ మాదిరిగా క్షేత్రస్థాయిలో జనం మధ్యలో పనిచేసే నాయకులను ప్రోత్సహించడం లేదు. దానితో మొదటిసారిగా ఢిల్లీ మున్సిపల్ ఎన్నికల్లో సైతం పరాజయం తప్పలేదు. 'శేష్ మహల్' గురించి కొంతమేరకు కేజ్రీవాల్‌ను ఇరకాటంలో పడవేసిన బంగారు పూత పూసిన టాయిలెట్ ఫిట్టింగ్‌లు, స్విమ్మింగ్ పూల్ వంటి అద్భుతమైన ప్రచారాలు వివరాలు అవాస్తవమని వెల్లడి కావడంతో వెంటనే బిజెపి తమ ప్రచారాన్ని మార్చివేశారు.వారు కేజ్రీవాల్ ఉత్తరప్రదేశ్, బీహార్ ప్రజలను 'ద్వేషిస్తున్నాడని' ఆరోపించడంపై దృష్టి సారించారు. ఉత్తరప్రదేశ్, బీహార్ నుండి తీసుకువచ్చిన నమోదిత ఓటర్లలో అకస్మాత్తుగా, వివరించలేని పెరుగుదల ఉందని ఆప్ అభ్యంతరాన్ని వ్యక్తం చేయడాన్ని వారు ఈ విధంగా ఉపయోగించుకునే ప్రయత్నాలు చేశారు. ఏదో ఒక దుష్ప్రచారంతో ఆప్‌ను ఆత్మరక్షణలో పడవేసి ప్రయత్నం కాకుండా నేరుగా ఢిల్లీ ఓటర్లను ఆకట్టుకునే విధంగా బిజెపి ప్రచారం చేయలేకపోతున్నారు. చివరకు ప్రధాన మంత్రి సైతం వ్యక్తిగత విమర్శలతో కేజ్రీవాల్ ప్రభావం ప్రజలపై తగ్గించేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు స్పష్టం అవుతుంది. అంతేగాని, ఢిల్లీ రూపురేఖలను తాము ఏ విధంగా మార్చగలమో చెప్పే ప్రయత్నం చేయడం లేదు.గతంలో యుపిఏ హయాంలో ఢిల్లీకి ఇతర రాష్ట్రాల మాదిరిగా పూర్తి రాష్ట్రస్థాయి అధికారాలు ఇవ్వాలని ఆందోళనలు జరిపిన బిజెపి గత పదేళ్లుగా ఢిల్లీ ముఖ్యమంత్రి అధికారాలను గణనీయంగా తగ్గించి వేసింది. పేరుకు రాష్ట్ర ప్రభుత్వమే అయినప్పటికీ ఓ మున్సిపల్ కార్పొరేషన్ మాదిరిగా ఢిల్లీ ప్రభుత్వాన్ని కేంద్రంలోని బిజెపి మార్చివేసింది. మరోవంక జమ్మూకశ్మీర్‌కు త్వరలో రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని స్వయంగా ప్రధాని మోడీ హామీ ఇచ్చి ఏళ్ళుగడుస్తున్నా ఆ దిశలో ఎటువంటి చర్యలకు పాల్పడటం లేదు. దానితో ఢిల్లీ ప్రభుత్వంలో గణనీయ మార్పులను తీసుకురాగలమనే భరోసాను ప్రజలలో బిజెపి కలిగించలేకపోతున్నది. ఢిల్లీ తీవ్రమైన నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న సమయంలో పొరుగున ఉన్న హర్యానాలోని బిజెపి ప్రభుత్వం సహకరించే విధంగా కేంద్రం ఎటువంటి చొరవ తీసుకోలేకపోయింది. ఢిల్లీలోని దళితుల మద్దతు పొందటం బిజెపికి ఓ సవాల్‌గా మారే సూచనలు కనిపిస్తున్నాయి. అంబేద్కర్‌పై ఇటీవల రాజ్యసభలో హోం మంత్రి అమిత్ షా మాట్లాడిన విధానం ఈ పార్టీ పట్ల దళిత వర్గాలలో ప్రతికూల సంకేతాలు వ్యాపించేందుకు దోహదపడుతున్నాయి. ఈ క్రమంలో 12 ఎస్‌సి రిజర్వుడ్ సీట్లు, మెజారిటీ దళిత ఓట్లు ఉన్న 30 నియోజకవర్గాలపై దృష్టి సారించింది. 2015, 2020 ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో 12 ఎస్‌సి రిజర్వుడ్ నియోజకవర్గాలలో బిజెపి ఒక్క సీటు కూడా గెలుచుకోలేక పోయింది. అంతకుముందు జరిగిన ఎన్నికల్లోనూ 2-3 సీట్లతోనే సరిపెట్టుకుంది. దళితుల ప్రాబల్యం గల నియోజకవర్గాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నప్పటికీ బిజెపి ఏమాత్రం వారిని ఆకట్టుకోగలదో చూడాల్సి ఉంది. వాస్తవానికి కేజ్రీవాల్‌తో సమానంగా ప్రజాదరణ గల నాయకులు ఎవ్వరూ బిజెపిలో లేరు. అందుకనే ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించేందుకు బిజెపి వెనకాడుతుంది. పైగా పలు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించకుండానే గెలుపొంది, ప్రభుత్వాలు ఏర్పాటు చేయడం, ప్రజాదరణతో సంబంధం లేకుండా ముఖ్యమంత్రులను ఎంపిక చేస్తున్న బిజెపి ఢిల్లీలో సైతం కేవలం ప్రధాని మోడీ ప్రజాకర్షణపైననే ఆధారపడుతుంది. అయితే గత ఏడాది లోక్‌సభ ఎన్నికల సమయం నుండి ఓటర్లను ఆకర్షించడంతో మోడీకి సైతం పరిమితులున్నాయని స్పష్టం కావడం బిజెపికి ప్రమాద సంకేతాలను సూచిస్తున్నది.ముఖ్యంగా ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఉపాధి అవకాశాలు సన్నగిల్లడం వంటి అంశాలు బిజెపి నుండి యువతను, మధ్యతరగతి ప్రజలను దూరం చేస్తుంది. అందుకనే ఢిల్లీ ఎన్నికలు బిజెపి నాయకత్వంపై అగ్నిపరీక్షగా మారాయి. ఈ ఎన్నికలలో గెలుపొందితే జాతీయ స్థాయిలో బిజెపికి వ్యతిరేకంగా కాంగ్రెస్‌తో సంబంధం లేకుండా కేజ్రీవాల్, అఖిలేష్, మమతా బెనర్జీ వంటి వారు కలిసి బలమైన ప్రత్యామ్నాయం అందించే ప్రయత్నం చేసే అవకాశం ఉంటుంది. బిజెపికి సైతం జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ కాకుండా మరో నాయకుడు మోడీకి పోటీగా ఎదగడం ఇష్టం లేదు. అందుకనే కేజ్రీవాల్‌ను ఓడించడం ఆ పార్టీకి చాలా అవసరంగా ఉంది. ఢిల్లీ ఎన్నికలలో కాంగ్రెస్ ఓ రకంగా ఏకాకిగా పోటీ చేస్తున్నది. ప్రతిపక్షాలు ఆప్ పట్ల సానుకూలత వ్యక్తం చేయడం రాబోయే రోజులలో జాతీయ స్థాయిలో ఆ పార్టీ మరింత ఏకాకిగా మారే సంకేతాలను అందిస్తున్నది.

# అమెరికన్లను దెబ్బతీస్తున్న హెచ్-1బి




వాషింగ్టన్,మంచి వేతనాలను అందుకునే అమెరికన్ ఉద్యోగులను తొలగించేందుకే హెచ్-1బి ఉపయోగపడుతోందని అమెరికన్ సెనెటర్ బెర్నీ శాండర్స్ ఆరోపించారు. వారి స్థానంలో తక్కువ వేతనాలకే వచ్చే విదేశీ కార్మికులను అధిక సంఖ్యలో కంపెనీలు నియమించుకుంటున్నాయని ఆక్షేపించారు. హెచ్-1బి వీసాలకు అవకాశం కల్పిస్తున్న లాకెన్ రిలే చట్టాన్ని సవరించాలని కోరుతూ చట్టసభలో ఒక ప్రతిపాదనను శాండర్స్ ప్రవేశపెట్టారు. హెచ్-1బి వీసాల కోసం కంపెనీలు చెల్లించాల్సిన రుసుములను రెట్టింపు చేయాలన్నారు. దీని ద్వారా లభించే ఆదాయంతో 20వేల మంది అమెరికన్ విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వవచ్చని తెలిపారు. హెచ్-1బి కార్మికులకు కంపెనీలు చెల్లించే వేతనాలను కూడా భారీగా పెంచాలని డిమాండ్ చేశారు. తక్కువ వేతనాలకు వచ్చే విదేశీ కార్మికులను నియమించుకోవడం ద్వారా కార్పొరేట్ సంస్థలు భారీ మొత్తంలో డబ్బును మిగుల్చుకుంటున్నాయని విమర్శించారు. హెచ్-1బి వీసాలను సమర్థిస్తున్న టెస్లా అధినేత ఎలాన్ మస్క్, భారతీయ అమెరికన్ పారిశ్రామికవేత్త వివేక్ రామస్వామిలపైనా శాండర్స్ విమర్శలను సంధించారు. ఇదిలావుంటే హెచ్1బి వీసాలను ఆసియావాసులు దుర్వినియోగం చేస్తున్నారనీ ఉన్నత చదువుకోసం వచ్చి ఉద్యోగాలను ఎగరేసుకుపోతున్నారనీ ప్రస్తుతం అమెరికాలో చెలరేగిపోతున్న విమర్శల వెనుకా మెజారిటీ శ్వేత జాతీయవాద విపరీత పోకడ వెల్లడవుతోంది. అమెరికన్ల ఉద్యోగాలను కొట్టేస్తున్నారన్న విమర్శ ఆసియావాసులను ప్రస్తుతం క్షోభపెడుతోంది. చదువు ముగిసిన తర్వాత ఉద్యోగాలు చేసే కాలాన్ని బాగా తగ్గించాలనే డిమాండు ఊపందుకుంటోంది. ఇది జరిగితే బాగా నష్టపోయేది భారతీయులే. లక్షలు ఖర్చుపెట్టి అమెరికాలో చదువుతున్న మొత్తం విదేశీ విద్యార్థుల్లో 25 శాతం పైగా భారతీయులే ఉన్నారు. అభివృద్ధిచెందిన దేశాల్లో పలుచోట్ల జనాకర్షణ, ఉన్మాద నినాదాలతో ఓట్ల రాజకీయాల్లో పైచేయి సాధిస్తున్న నేతల్లో విపరీత జాతీయవాద పోకడలు లేని వాళ్లను వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా గెలవటంతో ఈ విపరీతం మోతాదు బాగా మించిపోతోంది. వలసదారులకు, శరణార్థులకు సురక్షిత ప్రదేశంగా ఉన్నప్పుడే అమెరికా ఘనత గొప్పగా ఉంటుందని కెన్నడి ప్రగాఢంగా చెప్పారు. పౌరహక్కుల చట్టమే లేకపోతే ప్రజాస్వామ్యం గురించి, సమన్యాయపాలన గురించి, పౌరసమానత్వం గురించి ప్రపంచానికి నీతులు చెప్పే నైతిక అర్హతే అమెరికాకు ఉండేది కాదు. అవకాశాల సీమగా ఇప్పటికీ అమెరికాను పరిగణిస్తూ ప్రతి ఏటా దాదాపు లక్షల మందికి పైగా ప్రజలు అక్కడికి వెళుతున్నారు. 2021-24 మధ్య సగటున ఏడాదికి 24లక్షల మంది అక్కడికి చేరుకున్నారు. 1965 నుంచి చూస్తే క్రమేపీ లాటిన్ అమెరికా, ఆసియా నుంచి అమెరికాకు వెళ్లే వారి సంఖ్య బాగా పెరిగింది. మొత్తం వలసదారుల్లో 50 శాతం వారే ఉన్నారు. ఇంతగా వెళుతున్న వారందరికీ అక్కడ సమభావనతో సమాజంలో స్వాగతం లభిస్తోందనీ ఇప్పటికీ చెప్పలేం. ఎన్నోరూపాల్లో శ్వేతజాతి ఆధిక్యతా ధోరణులు ఎదురవుతున్నాయి. వలసల చరిత్రలోని విషాదాలనూ రాజకీయాలనూ జాతి ఆధిక్యతా ధోరణులనూ తెలుసుకుంటేనే ఈనాటి ట్రంప్ విధానాల నేపథ్యమూ అర్థం అవుతుంది. అమెరికా ఆధిక్యతకూ శ్వేతవర్గానికీ పెద్దపీట వేయాలనే తర్కానికీ ట్రంప్‌తో మళ్లీ ఊపు వచ్చినా దాని మూలాలు ఇప్పటివి కావు! ఆధిపత్య భావజాలాలపై ఆధారపడిన జాతీయవాదాలు ఎక్కడైనా నిలువరించాల్సిందే.

## ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 3053 దరఖాస్తులు

హైదరాబాద్, మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 3053 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్ ,గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 111, విద్యుత్ శాఖ కు సంబంధించి 100, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 55, ఇందిరమ్మ ఇండ్లు పథకం కోసం 2691 దరఖాస్తులు వచ్చాయి,

## భారత సంతతికి చెందిన సాయి వర్షిత్‌కు 8 ఏళ్ల జైలు

వాషింగ్టన్,అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ వద్ద 2023లో భారత సంతతి యువకుడు ట్రక్కుతో దాడికి యత్నించిన ఘటన తీవ్ర కలకలం రేపిన ఘటనలో నిందితుడైన తెలుగు సంతతి వ్యక్తి 19 ఏళ్ల కందుల సాయి వర్షిత్ కు కోర్టు 8 ఏళ్ల జైలుశిక్ష విధించింది. వర్షిత్‌ను అప్పట్లోనే పోలీసులు అరెస్టు చేశారు. తాజాగా ఈ కేసులో అతడికి 8 ఏళ్ల జైలు శిక్ష విధించినట్లు జడ్జి డాబ్నీ ఫ్రెడ్రిచ్ వెల్లడించారు. నాజీ భావజాలంతో వెళ్లి డెమొక్రటిక్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు యువకుడు యత్నించాడని పేర్కొన్నారు. 'ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వాన్ని నాజీ భావజాలంతో కూలగొట్టాలనే ఉద్దేశంతో సాయివర్షిత్ ఈ దాడికి యత్నించాడు. అవసరమైతే అధ్యక్షుడిని కూడా చంపాలని తాను నిర్ణయించు కున్నట్లు అంగీకరించాడు. దీంతో అతడికి 8ఏళ్లు శిక్ష విధించాలని న్యాయస్థానం నిర్ణయించింది. అతడి చర్యల వల్ల ధ్వంసమైన నిర్మాణాల తొలగింపు, పునర్నిర్మాణం మొదలైన ఖర్చులతో కలిపి నేషనల్ పార్క్ సర్వీస్‌కు జాఅ 4,322 డాలర్ల (సుమారు రూ.3,74,000) నష్టం వాటిల్లిందని కోర్టు పేర్కొంది. కోర్టు పత్రాల ప్రకారం.. 2023 మే 22 సాయంత్రం మిస్సోరిలోని సెయింట్ లూయిస్ నుంచి సాయి వర్షిత్ వాషింగ్టన్ డీసీకి చేరుకున్నాడు. అక్కడ ఓ ట్రక్కును అద్దెకు తీసుకొని రాత్రి 9.35 గంటల ప్రాంతంలో వైట్‌హౌస్ వద్దకువెళ్లి సైడ్‌వాక్‌పై వాహనాన్ని నడిపాడు. పాదచారులు భయాందోళనకు గురై పరుగులు పెట్టారు. అనంతరం శ్వేతసౌధం ఉత్తరభాగం వైపు భద్రత నిమిత్తం ఏర్పాటుచేసిన ట్రాఫిక్ బారియర్స్‌ను ఢీకొట్టాడు. ఆ తర్వాత ట్రక్కును రివర్స్ చేసి మరోసారి ఢీకొట్టాడు. వాహనం నుంచి కిందకుదిగి నాజీ జెండాను పట్టుకొని నినాదాలు చేశాడు. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. అధ్యక్షుడు జో బైడెను హత్య చేయాలనే లక్ష్యంతో ఉద్దేశపూర్వకంగానే ఈ దాడికి యత్నించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందుకోసం అతడు ఆరు నెలలుగా ఎ÷-లాన్ చేసి మరీ ఈ ఘటనకు పాల్పడినట్లు తేలింది. ఈవిషయాన్ని సాయివర్షిత్ విచారణలో అంగీకరించినట్లు సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ వర్గాలు మీడియాకు తెలిపాయి. దీంతో అతడిని అరెస్ట్ చేశారు.

# మాస్టర్ ప్లాన్..!

అమరావతి,పట్టుబట్టి గెలిచాం. రాజకీయ ప్రత్యర్థి ఇలాఖలో పాగా వేశాం. ఇక సీమ మనకు కంచుకోటగా మారాల్సిందే. జగన్‌కు అంతో ఇంతో బలమున్న రాయలసీమలో వైసీపీని తిరిగి పుంజుకోనివ్వద్దంటూ స్కెచ్ వేస్తోంది కూటమి. అందుకే జగన్ టార్గెట్‌గానే పవన్ దూకుడు పెంచుతున్నారు. వైసీపీ అధినేత కోటరీని వెంటాడుతున్నారు సేనాని. అభివృద్ధి పేరుతో చంద్రబాబు సీమవాసుల మనసు గెలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు. రాయలసీమ కూటమికి అడ్డాగా మారబోతుందా.? ఆ నాలుగు జిల్లాల్లో వైసీపీని కోలుకోకుండా చేయడంలో బాబు, పవన్ సక్సెస్ అవుతారా.?

రాయలసీమ మీద స్పెషల్ ఫోకస్ పెట్టాలని డిసైడ్..

మొన్నటి ఎన్నికల్లో ప్రభంజనం సృష్టించాం. అందరి అంచనాలను తలకిందులు చేసి రాయలసీమలో సత్తా చాటాం. ఇక సీమను వదలొద్దంటూ ఫిక్స్ అయిపోయిందట కూటమి. ప్రత్యేకంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్..రాయలసీమ మీద స్పెషల్ ఫోకస్ పెట్టాలని డిసైడ్ అయ్యారట. అందుకు ఉమ్మడి కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు రాజకీయాలపై పైచేయి సాధించే ఎత్తులు వేస్తున్నారట.

జగన్ బలం రాయలసీమలోనే..

ఇప్పటికీ వైసీపీ అధినేత మాజీ సీఎం జగన్ బలం ఎక్కడుందంటే..రాజకీయ అవగాహన ఉన్న వాళ్లు టక్కున చెప్పేది రాయలసీమ అనే. రాయలసీమ నాలుగు జిల్లాల్లో మొత్తం 52 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. ఏపీలో ఏ పార్టీ అధికారంలోకి రావాలన్నా మ్యాజిక్ ఫిగర్ 88 సీట్లు. అందులో సగానికంటే ఎక్కువ సీట్లు రాయలసీమ రీజియన్‌లోనే ఉన్నాయి.

వైసీపీని రాయలసీమలో కోలుకోలేని దెబ్బ కొట్టాలని ప్లాన్..

2024 ఎన్నికల్లో రాయలసీమలో వైసీపీ ఘోర ఓటమిని చవిచూసింది. ఆ నాలుగు జిల్లాల్లో వైసీపీని దాదాపుగా జీరో చేసి పారేసింది కూటమి. కానీ ఆ పార్టీ మళ్లీ పుంజుకుంటే రాయలసీమలో స్వీప్ చేయడం కష్టం కాదన్న అభిప్రాయాలు ఉన్నాయి. రాయలసీమలో తిరిగి పట్టు సాధించి నెల్లూరు, ఒంగోలులో చెప్పుకోదగ్గ సీట్లు తెచ్చుకున్నా..కోస్తా జిల్లాల్లో ఏ మాత్రం అనుకూలత పెరిగినా మరోసారి జగన్ సీఎం అవడం పక్కా అన్నది పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయం. అందుకే వైసీపీని రాయలసీమలోనే కోలుకోలేని దెబ్బ కొట్టాలని భావిస్తున్నారట డిప్యూటీ సీఎం పవన్.టీడీపీ అధినేత చంద్రబాబు అయితే చాణక్య వ్యూహాలనే అమలు చేస్తున్నారట. 2024 ఎన్నికల్లో జగన్ పార్టీ ఓడినా ఒంటరిగా పోటీ చేసి నలభై శాతానికి తక్కువ కాకుండా ఓట్ షేర్ దక్కించుకున్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. అందుకే సీఎం చంద్రబాబు ఇప్పటినుంచే 2029 ఎన్నికల కోసం పక్కాగా ప్లాన్ చేస్తున్నారట. జనసేన, బీజేపీతో కలసి రాబోయే ఎలక్షన్స్‌ను ఫేస్ చేయాలని ఫిక్స్ అయిన చంద్రబాబు అందుకు తగ్గట్లుగా సర్వం సిద్ధం చేసుకుంటున్నారట.

పవన్ ద్వారా రాయలసీమ యూత్‌ను ఆకట్టుకునేలా వ్యూహం..

సీమలో జనసేన ప్రభావం ఉందని నమ్ముతున్నారట చంద్రబాబు. పవన్‌కు ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్‌కు టీడీపీ, బీజేపీ ఓట్లు యాడ్ అయితే మళ్లీ ప్రభంజనమే అని లెక్కలు వేసుకుంటున్నారట. రాయలసీమ యూత్‌ను ఆకట్టుకునేలా పవన్‌ను అస్త్రంగా వాడాలని డిసైడ్ అయ్యారట బాబు. అలాగే బలమైన సామాజిక వర్గం కూడా గ్లాస్ పార్టీకి అండగా ఉంది. దాంతో వచ్చే ఎన్నికల్లోనూ ఇదే రకమైన థియరీని అమలు చేయాలని ఎత్తులు వేస్తున్నారట.

పక్కా వ్యూహంలో భాగంగానే తరచూ రాయలసీమ పర్యటనలు..

పక్కా వ్యూహంలో భాగంగానే తరచూ రాయలసీమ పర్యటనలు చేస్తున్నారట డిప్యూటీ సీఎం పవన్. ఈ మధ్యే కడప వెళ్ళి మరీ ఎంపీడీవో మీద జరిగిన దాడిని ఖండించి వచ్చారు. ఏకంగా రాయలసీమలోనే క్యాంప్ ఆఫీస్ పెడతానంటూ ప్రకటించేశారు. రాయలసీమ మీ జాగీరు కాదు.. గూండాగిరి చేస్తే ఊరుకునేది లేదంటూ వార్నింగ్ ఇచ్చారు పవన్. లేటెస్ట్‌గా కర్నూలు జిల్లాలో వెళ్లి డే లాంగ్ ప్రోగ్రాం పెట్టుకుని గ్రీన్ కో ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. త్వరలో కడపలో పర్యటించి.. సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల ఆధీనంలో ఉన్నాయని ఆరోపిస్తున్న అటవీ భూములను పరిశీలిస్తారట.సీఎం చంద్రబాబు రాయలసీమను రతనాల సీమగా చేస్తామంటున్నారు. వాటర్ రిసోర్స్ మీద ఫోకస్ పెట్టి..కరువు ప్రాంతంగా పేరున్న సీమలో పచ్చని పంటలు పండేలా చేయాలని భావిస్తున్నారట. గతేడాది గోదావరి, కృష్ణా నదీ జలాలు దాదాపు 6వేల టీఎంసీలు సముద్రంలో వృథాగా కలిసిపోయాయని..ఏపీ ప్రజలు అందులో 350 టీఎంసీలు మాత్రమే వాడుకోగలిగారని అంటున్నారు చంద్రబాబు. సముద్రంలో కలిసే నీళ్లు వ్యవసాయానికి ఇతర అవసరాలకు వాడుకుంటే రాయలసీమ రతనాల సీమగా మారుతుందని..ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు చెప్పుకొస్తున్నారు.

వైసీపీని దెబ్బకొట్టాలంటే అక్కడ పవన్ దూకుడు అవసరం..!

ఇదంతా ఎందుకు అంటే వైసీపీని రాజకీయంగా నిలువరించడానికేనన్న చర్చ జరుగుతోంది. రాయలసీమలో టీడీపీ బలానికి తోడు జనసేన కూడా తోడైతే

# కౌషిక్ రెడ్డిని ప్రోత్సహించేది ఎవరు..



హైదరాబాద్,బీఅర్ఎస్ నేత హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌషిక్ రెడ్డి వివాదాలకి మారుపేరుగా నిలుస్తున్నారు. దూకుడుగా వెళ్తూ పలుకేసులలో చిక్కుకుంటున్నాడు. ఆయనపై కేసులు హుజురాబాద్‌కే పరిమితం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా కూడ నమోదు అవుతున్నాయి. కౌషిక్ రెడ్డిని ప్రోత్సహించేది ఎవరు? బీఅర్ఎస్ అధిష్టానమా? లేదా అతని స్వంత నిర్ణయమేనా? బీఅర్ఎస్‌లో కొంతమంది నేతలు దూకుడుగా వెళ్తుంటే.. మరికొంత మంది సైలెంట్‌గా ఉంటున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హుజురాబాద్ ఎమ్మెల్యే కౌషిక్ రెడ్డి దూకుడుగా వ్యవహరిస్తున్నారు. గతంలో హుజురాబాద్‌లోనే దూకుడు ప్రదర్శించేవాడు. ఇప్పుడు ఎక్కడ సమావేశం జరిగిన అతడే లీడ్ తీసుకుంటున్నాడు. అది మండల పరిషత్ సమావేశం అయినా, అసెంబ్లీ సమావేశం అయినా రచ్చరచ్చ చేస్తున్నాడు. అయితే బీఅర్ఎస్ అధిష్టానమే కౌషిక్ రెడ్డిని ప్రోత్సహిస్తుందా.. లేదంటే తనని తాను ప్రమోట్ చేసుకుంటున్నాడా అని తెలియాల్సి ఉంది.మొన్న కరీంనగర్ జిల్లా సమీక్ష సమావేశంలో సంజయ్ కుమార్‌పై దురుసుగా ప్రవర్తించడంతో మరోసారి వార్తల్లోకెక్కాడు. ఈ దూకుడుని అధిష్టానం ప్రోత్సహిస్తున్న కొంతమంది బీఅర్ఎస్ నేతలకి నచ్చడం లేదనే ప్రచారం సాగుతుంది. అంతేకాకుండా వచ్చే ఎన్నికలలో బీఅర్ఎస్ విజయం సాధిస్తే కౌషిక్ రెడ్డి కీలక మంత్రిపదవి వస్తుందని సోషల్ మీడియాలో ప్రచారం అవుతుంది. ఏ చిన్నపాటి సంఘటన జరిగిన వెంటనే కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులని కలిసి వస్తున్నాడు.దీనిని బట్టి చూస్తే అధిష్టానం అండదండలు ఉన్నట్లు అర్థం అవుతుంది. అంతేకాకుండా ఈసమయంలో తన ఇమేజ్‌ని పెంచుకునే ప్రయత్నం చేస్తున్నాడు కౌషిక్ రెడ్డి. అయితే సీనియర్ నేతలు మాత్రం ఇతని దూకుడును పూర్తిగా సమర్థించలేకపోతున్నారు. ముఖ్యంగా రేవంత్ సర్కారుపై విమర్శల దాడితో చెలరేగిపోతున్నాడు.ఫిరాయింపుల అంశాన్ని కూడ తరుచుగా మాట్లాడుతూ వార్తల్లో నిలుస్తున్నాడు. ఎవరైతే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారో వారిని టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పిస్తున్నాడు. మొన్న జరిగిన సంఘటనపై రెండుమూడు రోజులు చర్చ సాగింది. నేరుగా కేటీఆర్ రంగంలోకి దిగి బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డెక్కాలి అంటూ పిలుపునిచ్చారు. దీంతో బీఆర్ఎస్ ముఖ్యనేతలు రోడ్డెక్కి నిరసన వ్యక్తం చేశారు.అయితే, కౌషిక్ రెడ్డి మాత్రం అటూ పార్టీ పెద్దల అండతో పాటు తన ఇమేజ్‌ని పెంచుకునే ప్రయత్నం చేస్తున్నాడు. కాంగ్రెస్ కూడ ఇది కౌషిక్ రెడ్డి చేస్తున్న నాటకం కాదని, బీఅర్ఎస్ పెద్దలు కేసీఆర్, హరిష్ రావు, కేటీఆర్ ప్రోత్సహిస్తున్నారని అంటున్నారు. తరుచుగా వివాదాల్లో చిక్కుకుంటున్న కౌషిక్ రెడ్డి హీరో అవుతాడా.. లేదంటే సెల్ఫ్ గోల్ అవుతాడా.. అనేది కాలమే నిర్ణయిస్తుంది.

# హైకమాండ్‌తో డైరెక్ట్ ఫైట్..



హైదరాబాద్,కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మహిళలకు పెద్దపీట వేస్తామన్న హై కమాండ్ కార్పొరేషన్ పదవులలో తగిన ప్రాధాన్యం ఇవ్వలేదు. సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు అవకాశం ఇవ్వాలి లేదంటే న్యాయం పోరాటం చేస్తా అంటూ గాంధీ భవన్ వేదికగా తన ఆక్రోశాన్ని వెళ్లగక్కింది. ఈ నేపద్యంలో సీఎం రేవంత్ రెడ్డి సునీతాని కొంత దూరం పెట్టినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలుగా తన పదవీకాలం ముగిసినా కూడా ఆమెను ఇంకా కొనసాగిస్తున్నప్పటికి నాకు మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు గా కొనసాగించాలి లేదంటే బీసీ మహిళ కోటాలో ఎమ్మెల్సీ పదవిని ఇవ్వాలని పట్టుబడుతుందట.ఈ నేపథ్యంలో మొన్నటివరకు ఢిల్లీ ఉండి హై కమాండ్ పెద్దలను కలిసి తనకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని లాబీయింగ్ చేసి ఫలితం లేక హైదరాబాద్ తిరిగి వచ్చిందని ప్రచారం జరుగుతోంది. దీనితో మహిళలకు కాంగ్రెస్ తగిన ప్రాధాన్యం ఇవ్వక పోతే మంత్రులను నిలదీయాలని గాంధీ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంచలన కామెంట్స్ చేసింది. రెండు రోజుల క్రితం మహిళ కాంగ్రెస్ కమిటీలు వేసి జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శులను ఇందిరా భవన్ లో ప్రకటించింది.కానీ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు సమాచారం ఇవ్వకపోవడంతో పీసీసీకి, సునీతా రావుకు గ్యాప్ ఉన్నట్లు అర్థమవుతుంది. ఈ నేపథ్యంలో సునీతా రావు వ్యవహారం పీసీసీకి అటు హైకమాండ్‌కు తలనొప్పిగా మారిందట. మహిళా కాంగ్రెస్ నేత సునీతా రావు వ్యవహారంను గమనిస్తున్న ఇటు టీ-కాంగ్రెస్, అటు హైకమాండ్ ఏ విధంగా తీసుకుంటుంది. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో సునీతారావుకు ప్రాధాన్యం ఇస్తారా? లేక మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా కొనసాగిస్తారా? ఆమె కామెంట్స్‌ను ఏవిధంగా తీసుకుంటారో చూడాలి.

# ఎపి బనకచర్లపై తెలంగాణ అభ్యంతరాలు



విజయవాడ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టబోయే బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వంతీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. దీన్ని వ్యతిరేకిస్తూ ఏపీతోపాటు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాయాలని నిర్ణయించింది. విభజన చట్టం ప్రకారం ఏదైనా నదిపై ప్రాజెక్టు నిర్మించాలంటే పొరుగు రాష్ట్రానికి సమాచారం ఇవ్వాలని, అయితే అది ఇవ్వకుండానే ప్రాజెక్టు ప్రకటన చేశారని తెలంగాణ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. బనకచర్ల ప్రాజెక్టు తెలంగాణ, ఏపీ ప్రభుత్వాల మధ్య తాజా వివాదానికి కారణమయ్యేలా ఉంది. దీనిపై పోరాటం చేయాలని రేవంత్ రెడ్డి సర్కారు నిర్ణయించింది.

నదుల అనసంధానం చేస్తామని ఇప్పటికే ప్రటించిన చంద్రబాబు ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును ప్రకటించారు. తమను సంప్రదించకుండా ఇలా ప్రాజెక్టు ప్రకటించడంపై అప్పట్లోనే అభ్యంతరం వ్యక్తం చేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం దీనిపై కేంద్ర స్థాయిలో పోరాటానికి సిద్ధమైంది. ఏపీ చేపట్టే నదుల అనుసంధాన ప్రాజెక్ట్ బనకచర్లపై అభ్యంతరం చెబుతూ కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి, గోదావరి, కృష్ణా నది యాజమాన్య బోర్డుకు ఘాటైన లేఖ రాయాలని అధికారులకు రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ ప్రాజెక్టును తెలంగాణ ఎందుకు అభ్యంతరం చెబుతోంది... అనే వివరాలు తెలియజేస్తూ లేఖలు రాయాలని స్పష్టం చేశారు. రెండు రాష్టాల్లో ఏ రాష్ట్రమైనా, ఏ నదిపైనైనా ప్రాజెక్టు చేపడితే జీఆర్ఎంబీ, కేఆర్ఎంబీ సహా పొరుగు రాష్ట్రానికి సమాచారం ఇవ్వాలని ఏపీ పునర్విభజన చట్టం స్పష్టం చేస్తోందని అంటోంది తెలంగాణ. ఇదే విషయాన్ని లేఖలో రాయాలని నిర్ణయించారు. బుధవారం నీటి పారుదల శాఖపై సమీక్ష నిర్వహించిన రేవంత్ రెడ్డి బనకచర్లపై అభ్యంతరం తెలియజేస్తూ లేఖ రాయాలని అధికారులు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహా నీటిపారుదల శాఖకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. కృష్ణా నదీ జలాల విషయంలో కూడా రాజీ పడే ప్రసక్తి వద్దని సూచించారు. ట్రైబ్యునల్స్‌లో గట్టి వాదనలు వినిపించాలని స్పష్టంచేశారు. ఐఎస్ఆర్‌డబ్ల్యూడీఏ-1956 సెక్షన్ 3 ప్రకారం జలాలు కేటాయించేలా వాదించాలన్నారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ముప్పు అంశంపై కూడా హైదరాబాద్ ఐఐటీతో చేయిస్తున్న స్టడీ వీలైనంత త్వరగా పూర్తి చేయాలని రేవంత్ స్పష్టం చేశారు. తెలంగాణలో మిగిలిన పెండింగ్ ప్రాజెక్టులు, వాటి అనుమతుల విషయంలో పక్రియను వేగవంతం చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# బిజెపి సంకల్ప్ పాత్రపై కేజ్రీవాల్ విమర్శలు




న్యూఢిల్లీ, అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో 'సంకల్ప్ పాత్ర-1'పై ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విమర్శలు గుప్పించారు. బీజేపీ ఇచ్చిన హామీలు 'ఆమ్ ఆద్మీ పార్టీ' నుంచి కాపీ కొట్టారని, తమ పార్టీ ఎంచుకున్న మార్గానే వాళ్లు అనుసరించేటప్పుడు ఏమాత్రం విజన్ లేని బీజేపీని ఎందుకు ఎన్నుకోవాలని ఆయన ప్రశ్నించారు. బీజేపీ 'సంకల్ప పాత్ర'ను ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా శుక్రవారం విడుదల చేశారు. మహిళలకు ప్రతినెలా రూ. 2,500 ఆర్థిక సాయం, గ్యాస్ సిలెండర్లపై రూ. 500 సబ్సిడీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించారు. ఢిల్లీలో ఆప్ సర్కార్ అమలు చేస్తున్న పథకాలన్నింటినీ కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. దీనిపై కేజ్రీవాల్ నిశిత విమర్శలు చేశారు. 'కేజ్రీవాల్ తరహాలోనే ఉచితాలు ఇస్తామంటూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు ఈరోజు ప్రకటించారు. నేను ఒకటే అడుగుతున్నాను. ఉచితాలు మంచివి కావని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇంతవరకూ చెబుతూ వచ్చారు. ఇప్పుడు ఉచిత హామీలు గుప్పించడం ద్వారా గతంలో తాము చెప్పినది తప్పని, కేజ్రీవాల్ చేసింది సరైనదేనని ఒప్పుకున్నట్టు అయింది. ఉచితాలు హానికరం కాదని, దేశానికి భగవంతుని ప్రసాదమని మోదీ చెప్పాలి' అని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. కేజ్రీవాల్ పథకాలన్నింటినీ కొనసాగిస్తామని నడ్డా ఇప్పుడు చెబుతున్నారని, ఆ విషయాన్ని సంకల్ప్ పాత్రలోనూ చేర్చారని అన్నారు. ఢిల్లీలోని మొహల్లా క్లినిక్‌లను మూసేస్తామని నడ్డా చెబుతుండటంపై తాను ఈరోజు ఢిల్లీ ప్రజల వద్దకు వెళ్లి, మొహల్లా క్లినిక్‌కు కావాలా, వద్దా అని అడిగానని చెప్పారు. మొహల్లా క్లినిక్‌లకు అనుకూలంగా ఉన్న వారు ఆప్‌కు ఓటు వేయాలని, వద్దనుకునే వారు బీజేపీకి ఓటు వేయాలని అన్నారు.నా పని మరింత మెరుగ్గా ఎలా చేయాలో నాకు బాగా తెలుసు. కేజ్రీవాల్ చేసే పనే మీరు చేస్తే మిమ్మల్ని ఎందుకు ఎన్నుకోవాలని ప్రజలు బీజేపీని అడుగుతున్నారు' అని ఆయన చెప్పారు. బీజేపీ మేనిఫెస్టో క్లుప్లంగా చెప్పాలంటే, కేజ్రీవాల్ చేసిన పనిని బీజేపీ అభినందించిందని చెప్పారు. బీజేపీకి ఒక ఎ÷-లానింగ్ అంటూ ఏదీ లేదని, ఆప్ మేనిఫెస్టోపై, ఆప్ హామీలపై పోటీ చేయాలనుకుంటోందని విమర్శించారు. ఇంతకంటే దరుదృష్టం మరొకటి ఉండదన్నారు. ఎలాంటి విజన్ కానీ, ఆలోచనలు కానీ ఎ÷-లానింగ్ కానీ లేని పార్టీని తన జీవితంలో ఎన్నడూ చూడలేదని బీజేపీపై కేజ్రీవాల్ విమర్శించారు.

# సైఫ్ అలీ ఖాన్‌ని రక్షించిన ఆటో డ్రైవర్ "భజన్ సింగ్ రాణా"..

ముంబై: బాలీవుడ్ యాక్టర్ సైఫ్ అలీ ఖాన్‌పై దాడి యావత్ దేశాన్ని షాక్‌కి గురి చేసింది. అయితే, సకాలంలో ఆయనను లీలావతి ఆస్పత్రికి తరలించిన ఆటో డ్రైవర్ ఇప్పుడు హీరోగా మారారు.ఆటో డ్రైవర్ భజన్ సింగ్ రాణా హుటాహుటీన సైఫ్‌ని ఆస్పత్రికి తరలించడంలో సాయం చేశాడు. ఈ సంఘటన గురించి ఆయన వెల్లడించారు. సైఫ్ తన ఆటో ఎక్కిన తర్వాత "ఆస్పత్రికి ఎంత సమయం పడుతుంది..?" అని అడిగారని చెప్పాడు. అది అత్యవసర పరిస్థితి, నా ఆటోలోకి ఎక్కుతున్న ఈ ప్రయాణీకుడు ఎవరు అని నేను కూడా భయపడ్డానని, నేను ఇబ్బందుల్లో పడతానేమో అని అనుకున్నాని డ్రైవర్ రాణా చెప్పారు."నేను వెళ్తున్న సమయంలో అకాస్మత్తుగా గేట్ నుంచి ఒక పెద్ద శబ్ధం వినించింది. ప్రధాన గేటు దగ్గర ఒక మహిళ ఆటో ఆపు అని అరుస్తోంది. మొదట్లో అతను సైఫ్ అలీ ఖాన్ అని తెలియదు. సాధారణ దాడి కేసుగానే భావించాను" అని రాణా చెప్పారు. " అతను (సైఫ్ అలీ ఖాన్) స్వయంగా నా వైపు నడిచి ఆటోలో కూర్చున్నాడు. అతను గాయపడిన స్థితిలో ఉన్నాడు. ఒక చిన్న పిల్లవాడు మరియు అతనితో మరొక వ్యక్తి ఉన్నాడు. నా ఆటోలో కూర్చున్న వెంటనే, సైఫ్ అలీ ఖాన్ నన్ను కిట్నా టైమ్ లగేగా (ఆసుపత్రికి చేరుకోవడానికి ఎంత సమయం పడుతుంది) అని అడిగాడు. మేము ఎనిమిది నుండి పది నిమిషాల్లో చేరుకున్నాము" అని అన్నారు."సైఫ్ అలీ ఖాన్ మెడ, వీపు నుంచి



రక్తస్రావం అవుతోంది. అతడి తెల్ల కుర్తా ఎర్రగా మారింది. చాలా రక్తం పోయింది. నేను వారి వద్ద నుంచి ఛార్జీ కూడా తీసుకోలేదు. ఆ సమయంలో నేను అతడికి సాయం చేయగలిగినందుకు నాకు సంతోషంగా ఉంది" అని ఆటో డ్రైవర్ రాణా చెప్పారు. ఆస్పత్రికి వెళ్లే క్రమంలో హోలీ ఫ్యామిలీకి లేదా లీలావతి ఆస్పత్రికి తీసుకెళ్లాలా అని ప్రశ్నించానని, వారు లీలావతి ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారని తెలిపారు. ఆస్పత్రికి చేరుకున్న తర్వాత మాత్రమే ఆయన సైఫ్ అలీ ఖాన్ అని తెలిసినట్లు చెప్పారు.

# నవ్యాంధ్రలో కూటమి ఫ్యూచర్‌కు తిరుగులేదా?



అమరావతి,ఎన్నికలు ఎప్పుడొచ్చినా కూటమిగానే రంగంలోకి దిగుతాం. మొన్న గెలిచామని లైట్ తీసుకోవడం లేదు.. ఇంకో పదిహేనేళ్లు టీడీపీతోనే దోస్తీ అంటున్నారు ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్. కలిసి కదం తొక్కి మొన్నే సత్తా చాటాం..రాబోయే రోజుల్లోనూ కలిసే నడుస్తాం..నవ్యాంధ్రను ఒక్కో మెట్టుపైకి ఎక్కిస్తామంటూ..కూటమి ఫ్యూచర్‌పై అటు సీఎం చంద్రబాబు, ఇటు డిప్యూటీ సీఎం పవన్ ఫుల్ క్లారిటీతో ఉన్నారు.మరో పదిహేనేళ్లు కలిసే ఉండాలని భావిస్తున్నాం. రెండు రోజుల నుంచి డిప్యూటీ సీఎం జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలివి. గతంలోనూ కూటమిగానే ముందుకెళ్తామని చెప్పారు పవన్. ఇప్పుడు మరింత గట్టిగా తన వాదనను వినిపిస్తున్నారు. గతేడాది జరిగిన ఎన్నికల్లో అనూహ్యంగా పొత్తు పెట్టుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి నేతల మధ్య అక్కడక్కడ విభేదాలు వచ్చాయి. నియోజకవర్గాల్లో మూడు పార్టీల లీడర్లకు కోఆర్డినేషన్ మిస్ అవడంతో పాటు వైసీపీ నుంచి వచ్చే నేతల చేరికల విషయం లోనూ కాస్త గ్యాప్ ఏర్పడింది.

**కుండ బద్దలుకొట్టి చెబుతున్న పవన్**

అనంతపురంలో బీజేపీ వర్సెస్ టీడీపీ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో టీడీపీ వర్సెస్ జనసేన.. ఇలా పలు జిల్లాల్లో కూటమి నేతల మధ్య గొడవలు రాజకీయంగా ఉద్రిక్తతలకు దారితీశాయి. ఇలాంటి సందర్భాల్లో పొత్తు ఉంటుందని కుండ బద్దలుకొట్టి చెప్తున్నారు పవన్. అయితే నియోజకవర్గాల్లో మూడు పార్టీల నేతల సఖ్యత కుదరకపోవడంతో పొత్తు కష్టమేనన్న వాదనలు వినిపించాయి. అయినా ఎక్కడా కూడా గాడి తప్పకుండా పొత్తు రథం పదిలంగా ముందుకు సాగింది.అయితే పొత్తు విషయంలో బాబు కంటే ముందే పవన్ క్లారిటీతో ఉన్నారు. పలుమార్లు సేనాని ఓపెన్‌గానే స్టేట్‌మెంట్ ఇచ్చేశారు. ఇంకో పదేళ్లు చంద్రబాబే సీఎంగా ఉండాలని ఆ మధ్య తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు పవన్. బాబు దూరదృష్టితో ఏపీ మరింత డెవలప్ అవుతుందని చెప్పుకొచ్చారు.ఆ తర్వాత కూటమి ఫ్యూచర్‌పై హస్తిన వేదికగా సీఎం చంద్రబాబు చేసిన కామెంట్స్ చర్చనీయాంశం అయ్యాయి. జమిలి ఎన్నికలు వచ్చినా..2029లో ఎలక్షన్స్ జరిగినా కలిసే పోటీ చేస్తాం.. ఇప్పటి నుంచే ఎన్నికలకు రెడీ అవతున్నామంటూ బాబు చెప్పడం హాట్ టాపిక్ అయింది. అధికారంలోకి వచ్చాం..అవసరమైపోయిందని కాకుండా..కలసి నడిస్తే పార్టీలకు, ప్రజలకు జరిగే మేలేంటి తెలిసిన నాయకులుగా అటు చంద్రబాబు, ఇటు పవన్ బిహేవ్ చేస్తున్నారు.ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చాయి. ఇందులో ఒక్క టీడీపీకి మాత్రమే గెలుపును సొంతం చేసుకునేంత ఓటు బ్యాంకు ఉంది. జనసేనకు పవన్ ఇమేజ్, క్యాస్ట్ ఈక్వేషన్స్‌తో చెప్పుకోదగ్గ ఓటు బ్యాంకు ఉన్నప్పటికీ సొంతంగా గెలిచేంత బలం లేదు. అలా అని కీలకం కాదని చెప్పలేం.ఏపీలో గెలుపోటములను డిసైడ్ చేసేంత సత్తా మాత్రం జనసేకు ఉంది. ఇక బీజేపీ అయితే కూటమితోనే అన్నో ఇన్నో సీట్లు సంపాదిస్తూ వస్తోంది. సో ఈ నేపథ్యంలో అధికారంలో ఉండాలని కోరుకునే ఈ మూడు పార్టీలు..కలిసి పోటీ చేస్తేనే పవర్ స్టీరింగ్‌ను పట్టుకోగలవన్నది రాజకీయ నిపుణుల అభిప్రాయం.పొత్తుపై ముందే అలర్ట్ అవడం వెనుక ఇంకో స్ట్రాటజీ ఉందట. ఏ పార్టీ ప్రభుత్వంలో ఉన్నా అంతో ఇంతో ప్రజావ్యతిరేకత కామన్. డిసైడింగ్ ఫ్యాక్టర్‌గా ఉండే ఆ ఓటు షేర్ మీదే గెలుపోటములు డిపెండ్ అయి ఉంటాయ్. అందుకే ఎవరిదారి వారిదే అని కాకుండా..లాంగ్ లివ్ కూటమి అంటున్నారు బాబు, పవన్.రాష్ట్రంలో జనసేన, బీజేపీ కంటే టీడీపీ ఓటు బ్యాంకే ఎక్కువ. ఆ పార్టీనే బూత్ స్థాయి వరకు చాలా స్ట్రాంగ్‌గా ఉంది. ఆ తర్వాత ప్రతీ ఊర్లో పవన్‌కు అభిమానులు ఉంటారు. అంత పటిష్టంగా ఉండి కూటమిని లీడ్ చేస్తున్న టీడీపీ, జనసేన అధినేతలే పొత్తు ఉంటుందని పదేపదే చెప్పడం వెనుక పెద్ద ప్లానే ఉన్నట్లు కనిపిస్తోంది.

**పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉంటాయా?**

రాజకీయాలు అన్నప్పుడు పరిస్థితులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. మొన్నటి ఎన్నికల్లో లభించినంత ప్రజా మద్దతు ఎప్పటికీ ఉండకపోవచ్చు. అలాంటప్పుడు కూటమిగా పోటీ చేస్తే..గత ఎన్నికల్లో వచ్చినంత ల్యాండ్ స్లైడ్ విక్టరీ కాకపోయిన..ప్రభుత్వ ఏర్పాటుకు మాత్రం ఇబ్బంది ఉండదనేది బాబు, పవన్ ప్లాన్‌గా తెలుస్తోంది. సేమ్‌టైమ్ కూటమిగా గెలిచారు..ఎన్నాళ్లు కలిసి ఉంటారు.? మిత్రబంధం ఎప్పటిదాకా.? అన్న ప్రశ్నలకు కూడా తమ కామెంట్స్‌తో క్లారిటీ ఇచ్చేస్తున్నారు టీడీపీ, జనసేన అధినేతలు. పొత్తు ఉంటుంది.. క్షేత్రస్థాయిలో టీడీపీ-బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు కలిసి నడవాల్సిందేనని ఇండికేషన్ ఇస్తున్నారు.మరో 15 ఏళ్లు పొత్తు ఉంటుందని అని పవన్ అంటున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సీఎం అయ్యేదెప్పుడు అనేది పెద్ద క్వశ్చన్‌గా మారింది. పవన్ మాత్రం పదవుల కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమంటున్నారు. ఈ టర్మ్‌లోనే రెండున్నరేళ్లు సీఎం పదవి అడగాలని కొందరు సూచించినా అలాంటి షరతులు ఏం పెట్టలేదు.రాబోయే రోజుల్లో కూడా కలిసి నడుస్తామంటే పవన్ సీఎం పదవి ఆశలు వదులుకున్నారా అన్న చర్చ జరుగుతోంది. లేక కూటమిగా పోటీ చేస్తేనే గెలుపు సాధ్యమని భావిస్తున్నారా.? టీడీపీకి అండగా నిలిచి..వాళ్ల మద్దతుతోనే సీఎం పదవిలో కూర్చోవాలని స్కెచ్ వేస్తున్నారా అనేది ఆసక్తికరంగా మారింది. పవన్ కామెంట్స్ నేపథ్యంలో ఏపీ పాలిటిక్స్ రాబోయే రోజుల్లో ఎలా ఉండబోతున్నాయో చూడాలి మరి.

# మంత్రివర్గంలో జిల్లాకు దక్కని ప్రాతినిధ్యం



కడప,కడప జిల్లాపై కూటమి ముఖ్య మంత్రి చంద్రబాబు కక్ష కట్టడం దురదృష్టకరమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో కడప జిల్లా ప్రజలు 7 అసెంబ్లీ స్థానాలకు గాను 5 స్థానాలలో టిడిపి కూటమి అభ్యర్థులను గెలిపించారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వం కడప జిల్లాకు అన్యాయం చేస్తునే ఉంది. శుక్రవారం వేంపల్లెలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చి 7 నెలలు అయ్యింది. ఈ ఏడు నెలల కాలంలో జిల్లాకు అనేక అన్యాయాలు జరిగాయి. రాష్ట్ర మంత్రివర్గంలో జిల్లాకు ప్రాతినిధ్యం లేదు. గతంలో జిల్లా నుంచి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించేవారు. ప్రస్తుతం ఒక్క మంత్రి కూడా జిల్లా నుండి లేక పోవడం శోచనీయం. రాష్ట్ర ప్రభుత్వం రెండు దఫాలుగా నామినేటెడ్ పదవుల జాబితా ప్రకటించింది. అందులో కడప జిల్లా నుంచి ఒక్కరికి కూడా ఒక్క చైర్మన్ పదవి ఇవ్వలేదు. పుష్పక విమానం లాంటి టిటిడి బోర్డులో కూడా కడప జిల్లా నుంచి ఒక్కరూ కూడా లేరు. శాంతి భద్రతల దృష్ట్యా కడప జిల్లా సున్నితమైన, కీలకమైన జిల్లా. గత రెండున్నర నెలలుగా ప్రభుత్వం కడపకు రెగ్యులర్ ఎస్పీని నియమించక పోవడం దారుణం. పొరుగున ఉన్న అన్నమయ్య జిల్లా ఎస్పీనే ఇన్ ఛార్జ్ ఎస్పీగా ఉంచారు. కేంద్ర ప్రభుత్వం 2023 డిసెంబర్ 4న కొప్పర్తి పారిశ్రామిక వాడకు రూ. 250 కోట్లతో ఎంఎస్ ఎంఈ టెక్నాలజీ సెంటర్ ను మంజూరు చేసింది. దీన్ని కొప్పర్థి నుండి అమరావతికి తరలిస్తూ 2024 సెప్టెంబర్ 24న రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలకు 2024-25 విద్యా సంవత్సరానికి 50 ఎంబిబిఎస్ సీట్లు కేటాయిస్తూ నేషనల్ మెడికల్ కమిషన్ 2024 ఆగస్టు 16న లెటర్ ఆఫ్ ప్రామిస్ ఇచ్చింది. తాము నిర్వహించలేక వసతి సౌకర్యం లేదని, ఫ్యాకల్టీ లేదు, ఆ సీట్లు మాకు వద్దని రాష్ట్ర ప్రభుత్వం 2024 సెప్టెంబర్ 9న జాతీయ మెడికల్ కమిషన్ కు లేఖ వ్రాయడం విడ్డూరంగా ఉంది. లేఖ రాయడం వలన మెడికల్ కళాశాలకు 50 సీట్లు రాకుండా పోయాయి. రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ నిధులు విడుదల చేయని కారణంగా కడప ? రాయచోటి ? మదనపల్లి ? బెంగుళూరు నూతన బ్రాడ్ గెజ్ పనులు మధ్యలో నిలిచి పోయాయి.. రోడ్డు విస్తరణ పేరుతో 4 సంవత్సరాల క్రిందట వేంపల్లె ? రాయచోటి రోడ్డును త్రవ్వి వదిలి పెట్టడం జరిగిందని, వాటిపై దృష్టి పెట్టలేదని ఆయన చెప్పారు. కడప ? రాజంపేట ? కోడూరు ? రేణిగుంట జాతీయ రహదారి టెండర్లు అయిపోయి 15 నెలలైనా పనులు మొదలు పెట్టలేదన్నారు. ఈ మార్గంలో రద్దీ ఎక్కువ కావడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు చెప్పారు. విభజన చట్టం ప్రకారం కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ఎలాంట్ నిర్మాణం జరగలేదని వాటి ఊసే లేదన్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com